UNIVERSAL LIBRARY
OU_206212
UNIVERSAL LIBRARY

వివేకచంద్రికలు:

# 8. శ్రీరామకృష్ణ, వివేకానందులు.



యమ్. వి. యల్. నరసింహారావుగారు.

T
294.5
K92R

ప్రకాశకులు:

రామకృష్ణ పూజామందిరము

కొత్తపేట, గుంటూరు.

అనసూయా ముద్రాక్షరశాల, గుంటూరు.

1933

All rights reserved]

వెల రు 0-2-0

I humbly dedicate this Booklet to

M. R. Ry., M. KALIDAS Pantulu garu

Whose son RAMAKRISHNA has been a perpetual

Inspiration to me.

M. V. L. NARASIMHA RAO.

# తొలిపలుకు.

యువక ప్రపంచము సాహిత్యాంబుధియందు, నవలా తరంగములలో ద్రోల్లుచున్నది. రత్నగర్భయందలి రత్నకాంతులు చూచుటకు మారు క్షారోదకములు మాత్రమే పానముచేయుచున్నది. తత్వశాస్త్రమువలె, సాహిత్యముకూడ సత్యస్వరూపిణివైపునకే త్రోవజూపుచున్నది. "సత్యం,శివం, సుందరం," ఇదియే మానవుని లక్ష్యము. యథార్థములో నీ మూడింటికి భేదములేదు. తర్కముచే, తత్వవేత్త సత్యమును తెలిసికొనుటకు ప్రయత్నించుచున్నాడు. తన్మయత్వముచేత కవి సత్యముయొక్క సౌందర్యము ననుగాంచుచున్నాడు. కాని ఫ్రెంచి కాల్‌రిడ్జి అను నిరుదాంకితుడగు నొక మహాకవి వచించినట్లు నవలకు సాహిత్యమున చోటేలేదు.

నవీనయుగము పరివర్తన యుగము. తత్వజ్ఞానములో కాలము గడుపు, వయసుమీరినవారికి చెప్పవలసినదే లేదు. యువక ప్రపంచము మాత్రము ఆవేశముతో ముందుకుగంతులిడుచున్నది. ఈ యువకులే రాబోవు యుగపురుషులు. ఇట్టివారు యేదోవిధముగా ప్రొద్దుబుచ్చక సోమరితనమును దరిజేరనీయక మహాపురుషుల జీవితములను, పఠించినచో మహనీయులు కాగలుగుదురని విశ్వాసము. తద్వారా దేశసేవకులై మానవాదర్శమును చేరగలరనియే మా యాశయము. ఆధ్యాత్మికానుభవమే మానవుని లక్ష్యము. బ్రహ్మానందమే జీవిత పరమావధి.

అస్మత్ సోదరులారా! మీ కాలమును కల్పనా కథ లతో వ్యర్థపుచ్చవద్దు. డ్రాకి పండితుడు వచించినట్లు (Fiction is to be replaced by biography) కల్పనాకథ లకు మారు మహాపురుషుల జీవితములు పఠించవలెను. మరియు అమ్మహానీయుడే వచించినట్లు, "There is no greater sermon than the biography of a great man". మహాపురుషుల జీవితములకన్న ఎక్కువగా నుపయోగించు నీతిబోధ వేరులేదు. ఇమ్మహనీయులే అజ్ఞానాంధకారము నకు చంద్రునివంటివారు. అట్టిసందర్భములో మహాపురుషు డయిన శ్రీరామకృష్ణుని జీవితము సర్వవిధముల పఠన యోగ్యము.

గాంధిమహాత్ముని గురించి యుపన్యసించుచు డాక్టరు హోమ్సు "There is no true baptism of soul than the knowledge of the eastern saint" మహాత్ముడైనయీ ప్రాగ్దేశపు భక్తాగ్రేసరుని తెలిసికొనుటకన్న ఎక్కువ నిజము యిన క్రైస్తవ సంస్కారములేదు. నెత్తిపై నీరు చిలకరించి నంతమాత్రమున క్రీస్తు ప్రదేశము మనకబ్బదు. అటులనే యజ్ఞోపవీతమును ధరించినంతమాత్రమున బ్రాహ్మణత్వము లభింపజాలదు. బ్రాహ్మణత్వము చేకూరదు. "బ్రహ్మజ్ఞా నంతు బ్రాహ్మణః" అను న్యాయము ననుసరించి బ్రహ్మ జ్ఞానమును పొందినవాడే బ్రాహ్మణుడు. శాస్త్ర గ్రంథములు చదివినంతమాత్రమున, బ్రాహ్మణుడు కాజాలడు. శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతయందు వచించినట్లు సమదృష్టికలవాడే నిజముయిన పండితుడు. నిజమయినజ్ఞాని. నిజముయిన భక్తుడు. నిజముయిన కర్మయోగి. అట్టివాడే మన శ్రీరామకృష్ణ పర

మహాంస. ఈతనికి పరమహంసయను నామము చెల్లునా ! ఇటీవల నొక మహాశయుడు " శ్రీరామకృష్ణు డేమహాభాష్యమును రచించెను ? అతనికి సంస్కృతజ్ఞానము లేదే ? పరమహంసయను నామము సార్థకమగునా ? " అని నన్ను ప్రశ్నించెను. శ్రీరామకృష్ణుడు భాష్యములు, రచించని మాట సత్యమే. భాష్యముల విషయమట్లుంచి తననామమే తానవ్రాసుకొనలేని లౌకిక విద్యాహీనుడు. కాని యీతని చదువు ఓ, న, మా, లలోనే ఓంకారాభ్యాసముతో సంపూర్తీకరణము చేయబడినది. మహాశయుడగు ప్రహ్లాదునివలె సత్యాసత్య స్వరూపమును తెలుసుకొనుటలోనే భగవత్తత్వ నిర్ధారణ యుండును. మానసము లగ్నముచేసి, ఆధ్యాత్మిక లక్ష్యమును లంఘించి, జీవబ్రహ్మైక్యానుసంధానమును, అనుభవపూర్వకముగా చవిజూచి బ్రహ్మానందానుభవమును మానవలోకమునకు కూడా చవిచూపినవాడు. ఇట్టిమహాశయుడు పరమహంసకాకపోవునా ? తర్కవ్యాకరణములనెడు బురదగుంటలలోబడి మానవ జీవితలక్ష్యమునకు దూరముగాక, ఆత్మప్రబోధము అను రెక్కలపై నెగిరి, మానవుడు పోజాలని మహత్తర యున్నత ఆధ్యాత్మిక, గగనమండలమున స్వేచ్ఛగా సంచరించినవాడే మనపరమహంస. "హెూమా" అనుపక్షి ఆకసమున సంచరించుచునే గ్రుడ్లుపెట్టును. ఆకసమునుండి క్రిందికి జారుచుండగా మధ్యనే పరిపక్వదశవచ్చి గ్రుడ్డులై అందలి పిల్ల బయల్వడును. క్రిందికిజారుచుండగనే కండ్లువచ్చును. రెక్కలు బలిష్ఠములగును. భూమండలము చేరకుండగనే ఆపిల్ల తిరిగి ఆకసమున నెగసిపోవును. అట్లే

మన రామకృష్ణుఁడు. వ్యావహారిక పంకిలమునబడక, జన్మించినదాది పారమార్థిక సత్యస్వరూపమునే వీక్షించి, అష్టాంగయోగముచే షట్చక్రముల భేదించి సమస్తలోకములను దాటి, సత్యలోకమును సమాధియందు వీక్షించినవాఁడే మన పరమహంస. ఈతని హంసఅధోసంచార మన్నమాట యెఱుగదు. ఊర్ధ్వసంచారమే యీతనిహంస నడక. మహత్తర తత్వజ్ఞానాభ్యాసముచే పాంచభౌతిక దేహమును పరీక్షించి, పంచకోశ గుహాస్వరూపమని తెలుసుకొని, సత్వరజస్తమోగుణాత్మకమైన ప్రకృతినిదాటి, అరిషడ్వర్గమునుజయించి, షడూర్ములను దాటి, అవస్థాత్రయాతీతుఁడై, స్థూలసూక్ష్మ కారణశరీరముల కావలనున్న, సృష్టిస్థితి లయములకు హేతుభూతమైనమహాకారణ స్వరూపమును, గుర్తించగలిగినవాఁడే మన రామకృష్ణ పరమహంస. ప్రారబ్ధ ఆగామిసంచితములులేక ప్రపంచక్షేమము కొఱకున్నూ, జగత్కల్యాణముకొఱకున్నూ దేహధారియై, మానవకోటియొక్క పాపములను, యేసుక్రీస్తువలె భరించినవాఁడే శ్రీరామకృష్ణ పరమహంస. ఇట్టి మహాపురుషుఁడు, మహత్తరజ్ఞానరాసినుండి, భూమండలముపైన రాలిన యొక తేజోకణమే. అట్టిమహాపురుషుని చరిత్రమును తెలుసుకొనగల్గుట, యెంత ఆనందకరము.

19వ శతాబ్దము మహా పరివర్తనయుగము. ఆకాలమున తేజస్స్వరూపు లెందరో జన్మించిరి. వంగరాష్ట్రమున దేవేంద్రనాథఠాకూరు మహర్షి బిరుదాంకితుఁడయ్యె. కేశవచంద్రసేనుఁడు బ్రహ్మర్షియని వ్యవహరింపబడెను ఇఁకను శ్రీరామకృష్ణుఁడు భగవాన్ అనుబిరుదమునకు అర్హుఁడయ్యె. ఏథెన్సు పట్టణమునకు సోక్రటీసె జ్ఞానచక్షువని వ్యవహరింప

బడెను. అట్లే 19వ శతాబ్దమునకు, జ్ఞానచక్షువెవరన్నచో శ్రీరామ కృష్ణ పరమహంసయేయని నిర్ధారణముగా చెప్ప వలెను.

ఈ చిన్నిపొత్తము, శ్రీరామ కృష్ణ వివేకానందుల జీవితసారస్య పూరితము. జీవితమన్నది యేకవచనము. శ్రీ రామ కృష్ణ వివేకానందులు బహువచనము. ఇది అసందర్భముగా నుండవచ్చును. కాని గ్రీసు దేశమునందలి సోక్రటీసు, ప్లేటో అనువ్యక్తులు వ్యవహారికమున యిద్దరయి నను, యదార్థములో సత్యముయొక్క రెండుపరిణామములు. సోక్రటీసు లేక ప్లేటోలేడు. ప్లేటో లేక సోక్రటీసులేడు. సోక్రటీసు పునాది. ప్లేటో దానిపై నిర్మించిన భవనము. అట్లులనే శ్రీరామకృష్ణ వివేకానందుల సంబంధముకూడనని నావిశ్వాసము. ఒకవస్త్రమునకు పేకపడుగులెట్లో, హిందూ మతమునందు శ్రీ రామకృష్ణ వివేకానందులు కూడ నట్లే. శ్రీ రామకృష్ణుని ఒక సువర్ణముద్రికయొక్క, యొక వైపునకు బోల్చినచో, వివేకానందుని రెండవవైపునకు పోల్చవచ్చును. శ్రీ రామకృష్ణుడు ఆత్మ. వివేకానందుడు దేహము. ఆత్మ లేనిదేహము, శవపేటిక నలంకరింపదగ్గది. ఇక దేహములేని ఆత్మయో మానవలోకమున కచింత్యము. శ్రీరామ కృష్ణుని ఆత్మప్రతిభయే, వివేకానందుని ప్రతిభావంతుని చేసినది. వీరి సంబంధమును చింతించుటకైన మానవులకు శక్యముగాదు. జీవుడు ఆవరణ విక్షేపములను దాటి ఆనందకోశమును సహి తము భేదించినప్పుడు, బ్రహ్మగా శోభిల్లుచున్నాడు. అట్లు లనే వివేకానందుడు శ్రీ రామకృష్ణునియందు లీనమై, శ్రీరా మకృష్ణుడుగానే శోభిల్లినాడు. భస్మీపటలీనమైన పాము

మనుసమూ, నిమిత్తమాత్రముగ నన్నట్లు వివేకానందుడు కూడా, నిమిత్తమాత్రుడై యుండెను. కాని వివేకానందుని యొక్క ప్రతిఅణువునుండి ప్రకాశించినది శ్రీరామకృష్ణుడే. మరియు సూర్య చంద్రుల సంబంధమే. శ్రీరామకృష్ణ వివేకానందులకు కూడా నిరూపించవచ్చును. సూర్య ప్రకాశముచేని చంద్రుడు తేజోవిహీనమైన నొక గోళము. చంద్రునికి స్వయం ప్రకాశములేదు. అప్రకాశమంతయు సూర్యునిదే. అట్లులనే వివేకానందుని ప్రతిభయంతయు శ్రీరామకృష్ణునిదే. వివేకానందుడు "నేనేమైన సత్యమును మీకు చెప్పినచో అది రామకృష్ణునిది. తప్పులన్నియు నావి" అని వచించియుండెను. యుదాహరణములో జీవబ్రహ్మ భేదము కల్పితమైనట్లు శ్రీరామకృష్ణ వివేకానందుల భేదముకూడా కల్పితము. ఈయిరువురు యథార్థములో నొక్కస్వరూపమే. వీరికిగల సంబంధము నేనొకవిధముగా చెప్పవలసివచ్చినచో, బ్రహ్మముఖమండలమునందలి ప్రకాశించు రెండు నేత్రములే శ్రీరామకృష్ణ వివేకానందులు.

అస్తిక దేశీయులారా! ఇట్టి మూర్తిస్వరూపమును తెలుసుకొనుటకు ప్రయత్నింపుము. చిత్రకారుడు ఏదో మూర్తిస్వరూపమును చిత్రించినచో, అది జీవ ప్రతిమైనను సంధానము. అట్టి పవిత్రస్వరూపమును చూడవలెనన్న భౌతిక ఇంద్రియములు చాలవు ప్రాయమువలయునన్న కలిము సాగము. భావతరంగములలో, ప్రతిబింబము కలమై తేలి పోవుచుండును. హృదయమునందు మూర్తి ప్రతిఫలించును.

మహాశయులారా! ఒక్కమాట. పూర్వం ఇరువది సంవత్సరములకు పూర్వము, శ్రీరామకృష్ణ వివేకానందుల బోధా

వృత్తముతో, నాకు ప్రథమ పరిచయము కలిగినది. వివేకా నందుడు చికాగోనగరమున జరిగిన మతసంబంధమైన పార్ల మెంటుసభలో హిందూమతముపై నొసంగిన గంభీరోపన్యాస ము నాదృష్టి నాకర్షించినది. ఆరోజులలో కండకావరముతో సత్యములని, దేహమే భగవానుడని, చావుఅన్నది లేనేలేదని, తత్త్వజ్ఞానము శూన్యమని, తిని తిరిగి త్రాగుటయే జీవితపర మావధియని, ప్రపంచమే సత్యమనినమ్మి, సత్తామాత్ర వస్తు స్వరూపమును, మరచిపోయిన నాకు ఆవివేకానందుని గంభీ రోపన్యాసము జంఝూమారుతమైనది. అజ్ఞానాంధకారము అంతరించి హైందవ గగనమండలమున జ్ఞానభాస్కరుడొకింత గోచరించినాడు. హిందూమతమన్న నాకొకింత గౌరవము గూడ యేర్పడినది. ఉపనిషత్తులు, గీత, యందు విశ్వాసము అంకురించినది. శ్రీరామకృష్ణ వివేకానందులన్న, పూజ్యభావ మేర్పడినది. ఇట్లు రెండు మూడు సంవత్సరములు జరిగినవి. కాలవిచిత్రమేమని చెప్పవచ్చును. సూర్యుడు పశ్చిమాంబుధి యందు మొగ్గని నిప్పుముద్దవలె జారిపడిపోయినాడు. చీకట్లు నలుదెసల వ్యాపించినవి. రాత్రి షుమారు ఏడు ఎనిమిది గంటల సమయము. నాయింటియందలి నేను చదువుకొను గదిలో ప్రవేశించితిని. ఇంటియందు ఎవరును లేరు. చాపపై కూర్చుండియుంటిని. ఏదియో నొక ఉద్రేకము జనించినది. ఒడలు ఝల్లుమన్నది. అంతలో చాపపై శయనించితిని. భయమన్న యెరుగని నాకు ఒకింత భయము గలిగినది. కార ణము తెలియదు. మాటరాదు. ఇట్టి సందిగ్ధావస్థలో శ్రీరామ కృష్ణుని మూర్తి ప్రత్యక్షమైనది. కన్నులకు కట్టినట్లు అగుపడి నది. ఏమి యాశోభ! ఏమి యామూర్తియందలి జీవకళ!

చిత్తవికాసము ముఖముపై తాండవమాడుచుండ సమాధి నిష్ఠయందు నిమగ్నుడై, కూర్చునియున్న ఆ రామ కృష్ణుని మూర్తి యిప్పటికి కూడ మరుపునకు రాదు. ఒక చేతితో అభయమిచ్చినాడు. కాని యీభావము నాకర్థముగాలేదు. రెండు మూడు నిమిషములలో ఆమూర్తి అంతర్ధాన మొందినది. భయము క్రమేణ పోయినది. తిరిగి నన్ను నేను తెలుసుకొన గలిగితిని. తదుపరి ఒకటి రెండు సంవత్సరములు జరిగినవి. గొప్ప ఆశయములతో, కలకత్తాకు వెళ్లితిని. శ్రీరామ కృష్ణుడు తపస్సొనర్చిన స్థానమును చూచితిని. రాణి రాస్మణి కట్టించిన దేవళమును జూచితిని. బేలూరు మఠమును సందర్శించితిని. పంచవటి కేగితిని. మనస్సంతయు ఆధ్యాత్మిక తలంపులతో నిండిపోయినది. భూలోకమంతయు స్వర్గధామముగా ప్రకాశించినది. కాని ఆ రోజులలో దేశసేవచేయ వలెనని సంకల్పించితిని రాజకీయ విషయములందు, పనిచేయవలయునని ఉత్సాహము జనించినది. మహాపురుషుల సందర్శించితిని. ఒకింత రాజకీయ నైతిక సాంఘిక మతసంబంధమైన గ్రంథములు చదివితిని. యువకావేశము దేహమునందలి ప్రతి అణువునందు బయలు వెడలినది. కాని "అన్యథా చింతయేత్ కార్యం, దైవమన్యత్ర చింతయేత్" తానొకటి తలచిన పరాత్పరుడింకొకటి తలంచునుగదా. వెంటనే నాకు ఒకింత నేత్రదోషము కల్గినది. నా ఆశయములకు భంగము వాటిల్లినది. డాక్టరులను సలహా అడిగితిని. కలకత్తా వదలవలసి వచ్చినది. చెన్నపట్టణము చేరి నేత్ర చికిత్స చేయించుకొంటిని. కాని లాభము లేకపోయెను. చికిత్సవలన ఎక్కువ నష్టమే కలిగినది. బాహ్యదృష్టి పూర్తిగా

పోయినది. ఎటు చూచిన అంధకారము. మానసికములో కలత. ప్రపంచమంతయు తారుమారైనట్లున్నది. ఈసంక్షోభము తుపానువలె వచ్చినది. ఈప్రళయ వాయువులో భావములు అను వృక్షములు, వేళ్లతో పెకలింపబడిట్లు కనబడినవి. ఇట్లు ఒకటి రెండు సంవత్సరములు గడచినవి. తుపాను వీచిన మరుదినమున సూర్యుడు తూర్పుదిక్కున స్వచ్ఛకాంతులతో గోచరించునట్లు నా ఆధ్యాత్మిక భావములు, నశించిన దనుకొన్న నా తత్త్వజిజ్ఞాస, తిరిగి అంకురించినది. ఆజిజ్ఞాసలో కొంతకాలము గడపితిని. తత్త్వశాస్త్రముయొక్క పరిశీలన కొంతజేసితిని. గ్రంథ పరిచయము కొంతగల్గినది. అంతర్దృష్టి పొడసూపినది. అంతకంతకు పెంపొందినది. తుదకు బాహ్యదృష్టిలేని కొరత తీర్చినది. ఇప్పుడెవ్వరైన నానేత్రదృష్టిని ప్రసాదించెద నన్నకూడ కావలెనని అంతగా నేను భ్రమపడను. నన్ను బాహ్యదృష్టి వ్యామోహపరుప జాలదు. శ్రీరామ కృష్ణుడు నాకొసంగిన అభయహస్తమునకు అర్థమిదియని తెలుసుకొగల్గితిని. అందుచే నాజీవిత కృషి ఆపరమ పవిత్రమూర్తియొక్క, ప్రాభవమును ప్రపంచమునకు, చాటుటయని నిశ్చయించుకొంటిని. గ్రామ గ్రామమునకు, పల్లె పల్లెకు, యీ మహనీయుని, జీవితసందేశమును, తెలుగుభాగ్యము, నాకు లభించినచో, ఇంక నేమి కావలయును? ఇదియే నాపని. శ్రీరామ కృష్ణ వివేకానందుల జీవితము, తద్వారా వారి సందేశము, సోదరులకు శక్తి వంచన లేక, చాటుప్రయత్నములో నాజీవితము పూర్తియైన యెడల, మహాభాగ్యమని

తలంతును. అదియే నాజీవిత పరమావధి. అట్టికృషియే నాకు బ్రహ్మానందమును చేకూర్పగలదని నానిశ్చయము.

మహాశయా! స్వవిషయము కొంత చెప్పవలసివచ్చి చెప్పితిని. పాఠకలోకము మన్నింతురుగాక. ఈ చిన్ని పొత్తమునందలి లోపములను విసర్జించి,ఏమైన యొకింత సత్యమున్న చో గ్రహింప గోరెదను. ఇక కథాభాగమునకు వచ్చెదను

తెనాలి.
15-4-33.

ఇట్లు తమ సేవకుడు,
మతుకుమల్లి వెంకట లక్ష్మీనరసింహారావు.

# శ్రీ రామకృష్ణ వివేకానందులు.

నిరంతర భక్తి విశ్వాసములతోఁ, కాళికాప్రతిమయొద్ద నిలచి, ఆరు సంవత్సరములకు పైగా ధ్యానించిన మహాపురుషుడెవ్వరు? శ్రీరామకృష్ణుడు. దేహమంతయు మండుచుండ గొంతెత్తి "అమ్మా" యను శబ్దమును ఆరు సంవత్సరములు యుచ్చరించిన పురుషశ్రేష్ఠుడెవ్వరు? శ్రీరామకృష్ణుడు. తన నామము తాను లిఖించుకొను స్థితియైనను లేక మహోత్తర విజ్ఞానమును ప్రపంచమునకు వెదజల్లిన సుజ్ఞాని యెవ్వరు? శ్రీరామకృష్ణుఁడు. ఎట్టిచదువు లేకయే, అష్టోత్తర శతోపనిషత్తులసారమును గ్రహించి పానము చేసినదెవ్వరు? శ్రీరామకృష్ణుఁడు. సంస్కృత భాషాజ్ఞానము లేకయే అష్టాదశ పురాణములు తెలుసుకోఁ గల్గిన దెవ్వరు? శ్రీరామకృష్ణుఁడు భక్తి చిత్తముచే జగన్మాతను వశీకృతమొనర్చుకొని, మహోత్తర విజ్ఞానముచే అద్వైతసిద్ధిని సాధించిన ధీశాలి యెవ్వరు? శ్రీరామకృష్ణుఁడు. జ్ఞానాభ్యాసముచే వాసనాక్షయమును బొంది, జీవన్ముక్తుఁడై, అజ్ఞానాంధకారమును ప్రకృతిమాయపై, ఇంద్రధనస్సు కాంతులతోఁ, ప్రకాశించిన దెవ్వరు? శ్రీరామకృష్ణుఁడు. అష్టాంగయోగము నభ్యసించి సమాధి స్థితియందు ఆగూఢ జ్ఞానముచే. జీవ బ్రహ్మైక్యాను సంధానమొనర్చిన మహాపురుషుఁ డెవ్వరు? శ్రీరామకృష్ణుఁడు

ప్రపంచవ్యామోహమను కాఱుమబ్బులను భక్తియను వాయువుచే పారద్రోలి చెల్లాచెదరొనర్చి, ప్రచండజ్ఞానభాస్కరుని ప్రపంచమునకు చూపిన మహనీయుడెవ్వరు? శ్రీరామకృష్ణుడు. 19 వ శతాబ్దమునకు యుగపురుషుడై "భగవాన్" అను బిరుదు మానవకోటివల్ల బడసిన పురుషోత్తముడే శ్రీరామకృష్ణుడు. అట్టిశీశాలి, భక్తాగ్రేసరుడు, స్థితప్రజ్ఞుడు, జీవన్ముక్తుడే మన రామకృష్ణుడు. అతనిచరిత్ర మహ్యద్భుతము. వర్ణనాతీతము ఆనందజనితము. ఆశ్చర్యకరము. మహాపవిత్రము. ఇట్టి పరమ పావనమైన వాని చరిత్రము కొనియాడవలెనన్న వేనోళ్లుగల ఆదిశేషునకే, తగినపని నాబోటి పామరుడు, దానిని వ్రాయుట మహాసాహసము. కాని శ్రీరామకృష్ణ పూజామందిరమువారి బలాత్కారముచే యీ చిన్న పొత్తము వ్రాయవలసి వచ్చినది.

మహాశయా, 19 వ శతాబ్దమున హిందూ దేశమంతయు పాశ్చాత్య వ్యామోహముతో నిండిపోయినది. అందు ముఖ్యమైనది వంగరాష్ట్రము. భావములా పాశ్చాత్య భావములు. తలంపులా పాశ్చాత్య తలంపులు. దృష్టి పాశ్చాత్య దేశముపైననే నిలచిపోయినది. ఇంచు మించుగా పాశ్చాత్య వ్యామోహము సంపూర్ణమై పోయినది. ప్రపంచమునకు జ్ఞానచంద్రికలు ప్రసాదించిన ఋషిపుంగవులను తలచువారే లేకపోయిరి. ఉపనిషత్తులను నామముకూడ మరచిపోయిరి. కురుక్షేత్ర సంగ్రామమున ప్రతిభాశాలియై నిలచి నిస్పృహాత్వముచే కృశించిన, అర్జును నుద్ధరించి మానవ కళ్యాణమునకై యొసంగిన గీతామృతమును చవిచూచువారే లేకపోయిరి. యాజ్ఞవల్క్యుడు, ఉద్దాలకారుణి, అను సుప్రసిద్ధ తత్వజ్ఞా

నుల నాయకులు మఱుపునకు వచ్చెను. ఎచ్చట చూచిన
కోంటు, స్పెన్సరు, అను పాశ్చాత్య తత్త్వశాస్త్రజ్ఞుల నామ
ములే చిరస్మరణీయములై పోయినవి. కోంటు, హిజిలులే తార
కమంత్రములై పోయినవి. మీదు మిక్కిలి హైందవ సిద్ధాంత
ములపై దూషణలు గూడ బయల్వెడలినవి. ఎటుచూచిన
నాస్తికులు, అర్ధనాస్తికులు, రిఫార్మరులు, కన్వర్టెడు క్రిస్టియ
నుల ఘోషయే. ఆహా! ఏమి ఆశ్చర్యము. విధియిట్లున్నది
కాబోలు. పాడిపంటలకు నిలయమై ఐశ్వర్య విజ్ఞానములచే
ప్రపంచ దృష్టిని ఆకర్షించిన భారతమాతయొక్క ముఖము
వెల వెల బారజొచ్చినది. భీష్మాచారివంటి విజ్ఞానులను,
శ్రీశుకునివంటి మహా పవిత్రులను, హరిశ్చంద్రునివంటి సత్య
దీక్షాపరులను, జనకునివంటి నిష్కామయోగులను, యాజ్ఞవ
ల్క్యునివంటి తత్త్వవేత్తలనుకన్న భారతమాత గొడ్డుబోయిన
దా యను నట్లుండెను.

భగవద్గీతయందలి "యదా యదాహి ధర్మస్య గ్లాని
ర్భవతి భారత", "పరిత్రాణాయ సాధూనాంవినాశాయచదు
ష్కృతాం", అను శ్లోకములు వ్యర్థములా? కావు. కావు. ధర్మ
సంస్థాపనార్థమై ప్రతియుగమునందు తానే యవతరించెదనని
చెప్పిన శ్రీకృష్ణ భగవానునియొక్క వాక్యములు సువర్ణాక్షర
ములే. శ్రీరామ, కృష్ణ, బుద్ధయవతారములను లోకమునకు
ప్రసాదించిన భారతమాత యిప్పుడు, యీ 19 వ శతాబ్దము
నందు, శ్రీరామ కృష్ణావతారమును మనకు ప్రసాదించి మనల
నుద్ధరించినది. ఈరామకృష్ణుడు, శ్రీరామకృష్ణావతారముల
సమ్మేళన అవతారమే నని మనవి చేయుచున్నాను.

భగవానుడు సర్వ సమర్థ్యమును చూపుటకోయన శ్రీరామ చంద్రుడై, దశరథుని సౌధమున కౌసల్యా గర్భమున జనించె. శ్రీకృష్ణుడై చెరసాలలో దేవకీ గర్భమున జనించె. ఇకమున శ్రీరామకృష్ణుడో దరిద్రుల గర్భమున గొడ్లసావడియందు జనించెను. ఈతని తండ్రి ఖుదీరామ్ చటోపాధ్యాయుడు. ఆతడు మహాభక్తుడు. హరిశ్చంద్రుని వలె సత్యదీక్షాపరుడు. తల్లియో చంద్రమణి. నిజముగా తనభర్త నీడననుసరించిన చంద్రమతియే. వీరి యాన్యోన్య దాంపత్యమునందు హైందవ లక్ష్యము, చంద్రునితో గూడిన వెన్నెలవలె శోభిల్లినది. వీరొక కుగ్రామమున, భగవత్ చింతలో కాలముగడుపుచు జీవయాత్ర సలుపుచుండ, ఆకస్మికముగ యొక పిడుగువంటి వార్త వచ్చినది. అదియేమి? ఆగ్రామపు జమీందారు ధనమదాంధుడు. దుర్మార్గుడు. ఒక సందర్భములో ఖుదీరాముని తప్పుడు సాక్ష్యము చెప్పవలసినదిగా బలాత్కరించెను. కాని ఖుదీరాముడందులకు అంగీకరింపడయ్యె. అందులకా జమీందారు ఖుదీరాముని ఆగ్రామమును వదలిపెట్టి వెళ్లవలసినదిగా నాజ్ఞాపించెను. తన సత్యదీక్ష కాపాడుకొనుటకోయన, హరిశ్చంద్రునివలె భౌతికసుఖము నపేక్షించక, కమ్రిపురమను గ్రామమునకు భార్యా పుత్రాదులతో ఖుదీరామ్ వెళ్లెను. ఈదంపతులు ఆగ్రామములో స్థావరము నేర్పరచుకొని, భగవత్ చింతలో కాలము గడుపుచుండిరి. ఇంతలో ఖుదీరామ్ మహాశయుడు యాత్రార్థమై గయకేతెంచెను. గదాధరుని దర్శించి ధన్యుడయ్యె. ఒకరాత్రి, శయనించి యుండగా, గదాధరుడు ఖుదీరామునకు స్వప్నమునందు సాక్షాత్కరించెను. గదాధ

రుడు ఖుదీరామునింట మానవ దేహధారియై జన్మించెదనని వాగ్దానమొనర్చెను. ఇట్టి సమయములో ఖుదీరాముని సతీతిలకమగు చంద్రమణీదేవి యింటిముందు శయన మందిరమున నిద్రించుచు గాఢ సుషుప్తి యందుండెను. స్వప్నావస్థలో గర్భమైనట్లు గోచరింప, ఆమె వెంటనే మేల్కాంచి, ఆశ్చర్య చకితురాలాయెను. ఆగదిలో ప్రతి యాంగుళమును తేజస్సుతో నిండిపోయెను. ఆమెకు అనేక విధములగు భగవల్లీలలు గోచరించెను. చంద్రమణీదేవి భయ కంపితురాలై యీసంగతిని యిరుగు పొరుగు తనస్నేహితు రాండ్రకు నివేదించెను. వారామెనోదార్చిరి. ఇదిజరిగిన కొలది కాలమునకు యాత్రలు పూర్తిగావించుకొని ఖుదీరాం మహాశయుడు తిరిగివచ్చెను. భర్త వచ్చిన తోడనే చంద్ర మణి యాతనికీ విషయమును పూసగ్రుచ్చినట్లు తెలిపెను. ఆయన గదాధరుని వరప్రసాదమేనని తెలుసుకొని చంద్ర మణీదేవికి గయలో తాను గాంచిన కలను గురించి చెప్పెను.

ఇట్లుండ చంద్రమణికి నవమాసములు నిండెను. ఒకా నొక శుభ ముహూర్తమున, 1835 సం॥ ఫిబ్రవరి 18 వ తేదిన, నవీన భారతవర్షోద్ధారకుడును, ప్రపంచోద్ధారకుడును, యుగపురుషుడును, మన కథానాయకుడు నగు శ్రీరామకృ ష్ణుడు సామాన్య కుటీరమునందు జన్మించెను. బిడ్డ భూపతన మైన వెంటనే దొర్లుకొనుచు ప్రక్కనున్న భస్మములోనికి పోయెను. శరీరమంతయు భస్మముచే కప్పబడి, చూచుట కొక విరాగివలె గాన్పించెను. జన్మతోనే విరాగమును సూచించు భస్మ మాతని శరీరము నలంకరించుటలో గల

విశేషమును పాఠకులు ముందు గ్రహించ గలరు. ఈ శిశువు పుట్టినప్పుడే మామూలు బిడ్డలకన్న భారీవాడై, యేండ్లుగడచిన బాలునివలె నుండెను. గదాధర వరప్రసాదముచే గలిగినందువలన తలిదండ్రులీతనికి గదాధరుడని నామకరణం బొనర్చిరి.

ఈతని బాల్యలీల లత్యద్భుతములు. జన్మ ప్రభృతి విరాగమే యీతనికి ముఖ్యలక్షణమై యుండెను. పురాణ కాలక్షేపములన్న యీతని యాసక్తి వర్ణనాతీతము. వీధి నాటకములన్న పంచప్రాణములు. అనేక పర్యాయములు మనరామకృష్ణుడు నాటకములలో పాత్రలను ధరించి, యా పాత్రాభినయమునందు లీనుడై బాహ్య ప్రపంచమును సంపూర్ణముగా మరచి బ్రహ్మానంద సౌఖ్యమునను భవించెను. ఇట్లు పండ్రెండు వత్సరములు గడచెను. ఈవయస్సునకే మనరామకృష్ణునియందు ఆధ్యాత్మిక చింతపూర్తిగానుండెను. భగవధ్యానము చేయుటకు అర్థరాత్రులయందు నిర్భయముగా స్మశానములయొద్దకు వెళ్లెడువాడు. ఈతని కార్య దీక్షకు, ఆధ్యాత్మిక సాధనాసక్తికి తలిదండ్రులు సహితి మాశ్చర్య పడెడివారు.

పాఠకమహాశయా, ఒక్కసారి తమదృష్టిని కలకత్తా వైపునకు మార్చవలెను. కలకత్తా ప్రాంతమున నున్న దక్షిణేశ్వరమును ఒక్కపర్యాయము తమమనస్సునకు దెచ్చుకొనుడు. ఏమి ఆయానందము! ఏమి ఆకలకలనినాదము! హర్షధ్వనులు మిన్నుముట్టుచున్నవి. ఆమెయెవరు? రాణి రాస్మాణి. ఆస్టీమర్లు, ఆపడవలు, యెక్కడికి పోవుచున్నవి? కాశీ ప్రయాణము చేయుచున్నవి. విశ్వనాథుని సందర్శించి

ధన్యురాలగుటకు రాణీగారు కాశీయాత్రకు ప్రయాణమాయెను. కాని అకస్మాద్భుత విపత్తు యొకటి జరిగినందువలన ఆమె కాశీకి వెళ్ళవలసిన పని లేకపోయెను. కాశీ విశ్వనాథుడు ఆ తల్లియొక్క భక్తికి సంతోషించి రాణీగారికి కలలో దర్శనమిచ్చి ఆమె కాశీకి రావలసిన పనిలేదనియును, ఓడలు మొదలైనవి ఆసాయంకాలము దిగిన ప్రదేశమగు దక్షిణేశ్వరమునందు జగన్మాతయగు కాళికాంబ కొక దేవళమును నిర్మించుమని యాజ్ఞాపించి యదృశ్యుడాయెను. భగవత్సంకల్ప మీడేరకపోవునా? రాణిరాస్మణి నిద్రలేచి ఆశ్చర్య చకితురాలాయెను. ఆప్రశాంతసమయమున మానసికాంబుధినం దుద్భవించు యానందతరంగముల నెవరు వర్ణించగలరు? తన్మయత్వముపొందినదై తనయొక్క జీవితపరమావధిని పొందినట్లు భావించెను. తెల్లవారవచ్చుచున్నది. అరుణోదయకాంతులు పూర్వదిక్కున పొడచూపుచున్నవి. ప్రకృతియంతయు మేల్కాంచినది. పూర్వదిక్కున సూర్యుడుదయించెను.

విశ్వనాథుని యాజ్ఞానుసారము ప్రయాణమును మునిగించి రఘూమి ప్రొద్దెక్కునరికి పరివారముతో సహా రాణిరాస్మణి కలకత్తానగరమునకు తిరిగివచ్చెను. ఆనిమిషమునుండి దేవాలయ నిర్మాణమునకు బూనుకొనెను. సంకల్పము భగవానునిది. కార్యభారము వహించినది ధనవంతురాలయిన మహారాణి. సహజముగ ఆమెకుగల భగవద్భక్తి విశ్వాసములు శ్రీ విశ్వనాథుని యాజ్ఞచే ననేకరెట్లుగ విస్తరింపచేయబడెను. విశ్వనాథుని యాజ్ఞను శిరసావహించి జగన్మాతకు సర్వవిధముల తగియుండు దేవళమును నిర్మించుటయే ఆమె సంకల్పముకాని, దానికగు ధనవ్యయమును గురించిన ఆలోచనను

ఆమెమనస్సునకు గానేలేదు. వేలు పునాదులను నిర్మించుటకే పూర్తియాయెను. దేవాలయముపూర్తియగుసరికి ఖజానాలో నుంచి 9 లక్షల రూప్యములు వ్యయమయ్యెను.

వంగరాష్ట్రమునగల మహా పండితులందరికిని భగవత్ప్రతిష్టకు రావలసినదిగా యాహ్వానము లంపబడెను. సుముహూర్తము నిశ్చయింపబడెను. పలు ప్రదేశములనుంచి పండితోత్తము లేతెంచిరి. దక్షిణేశ్వరమంతయు ప్రజాసముదాయముతో నిండిపోయెను. భగవత్ప్రతిష్ట మహా వైభవముతో జరిగెను. కాళికాలయమున మనరామకృష్ణుని అన్నగారైన రామకుమారు అనునాయన అర్చకత్వమునకు నియమింపబడెను. కొలది కాలమునకు రామకుమారు స్వగ్రామమునకు వెళ్లుచూ తన స్థానమున మన రామకృష్ణుని వినియోగించెను. పాఠకమహాశయులొక్క పర్యాయము తమదృష్టిని కాళికాలయము వంకకు త్రిప్పి గర్భగుడియందలి వెండిపీఠముపై నిలచి తాండవమాడుచున్న ఆ జగజ్జనని నొక్క పర్యాయము తిలకింపుడు. ఆమె మహాశక్తిస్వరూపిణి. మహాకాళి. ఆవిగ్రహము నలుపురంగుగ నుండును. శిరోజములు విరియబోసుకొని, మానవుని పుర్రెలహారమును మెడదాల్చి ఒకచేతితో ఖడ్గము ధరించి, మరియొక చేతిలో రక్తము స్రవించుచున్న మానవ శిరమును కలిగియున్నదా జగన్మాత. బెనారసు చీరగట్టి నడుమునకు బంగారు మొలనూలుచే నలంకరింపబడిన జగదీశ్వరి రూపమును గురించి మన మొకింత తెలుసుకొనవలసియున్నది. ప్రపంచమున కామ్యవ్యాపారములలో లీనమై అజ్ఞానాంధకారమున చిందులు ద్రొక్కుచు, భగవంతుని మరచి, కామినీ కాంచనములకు దాసులై తుచ్ఛులై

పరాత్పరునకు దూరులై, కాలునిచే మ్రింగబడిన వారిపుర్రెల హారమే జగజ్జనని కంఠమున ప్రకాశించు హారము. ఐహిక సుఖలంపటులైన వార లీ జగన్మాతచే శిక్షింప బడుదురు. భక్తిలేక కామినీ కాంచనములకు దాసులైనవారికి జగజ్జనని యొక్క యనుగ్రహము కలుగుట దుర్లభము. అభయము నిచ్చుచున్న జగన్మాతయొక్క రెండవహస్తమును గురించి తెలిసికొన ప్రయత్నింతము. వ్యామోహమునకు దూరులై ఐహిక సుఖముల నుపేక్షించి, సద్గోష్ఠి నపేక్షించుచు భగవత్పాదార విందములయందు జీవిత భారమునంతయు వేసిన భక్తాగ్రేసరులకు రక్షణమొసంగుటయే ఆ యభయహస్తమున కర్థము. అదియే జగన్మాతయొక్క అనుగ్రహ సూచన. ఈ మహాశక్తిస్వరూపిణి, కామ్యదృష్టిగలవారికి తన భయంకర స్వరూపమును చూపును. భక్తులకు మాత్రము కరుణాపూరిత మగు మాతృస్వరూపమును జూపును. ఇట్టి యత్యద్భుత భావములతో ప్రకాశించు యీమహాతల్లిని ధూప దీప నైవేద్యాదులతో సేవించు మహాభాగ్యము మన రామకృష్ణునకు కలిగినది.

పాఠకమహాశయా, మనరామకృష్ణుడు బాలుడుగదా. నవనీతమువంటి హృదయముతో జగన్మాతనారాధింపవచ్చినాడు. గర్భగుడి ప్రవేశించినాడు. అమ్మా యను, ప్రేమపూర్వక, సంబోధనతో, జగన్మాతచెంత నిలువబడినాడు. "తల్లీ నిన్ను సేవించుటకు, నేనిక్కడికి వచ్చినాను. నేను చేయు పూజలలో, లోపములు జరుగుచో, నీవే నన్నుమన్నించవలెను. నేను చదువుసంధ్యలు రాని వాడనుగదా, తల్లీ. అమ్మా, యివిగో పుష్పములు. వీనినిప్పుడే నీపూజకొరకు

తెచ్చితిని. దండగా గ్రుచ్చితిని. నీకంఠమును దీనితో నలంకరించెదను. అమ్మా, యీపుష్పపరిమళము నాఘ్రాణించుము. అమ్మా, ఆఘ్రాణించుచున్నట్లు లేదేమి? నేను నీబిడ్డనుగాదా? ఇదిగో నీకు ధూపమును సమర్పించుచున్నాను. దీనినైనను గ్రహించుము. తల్లీ, యిప్పటికి జాము ప్రొద్దెక్కినది. ఆహారమునకు వేళయైనది. ఇప్పుడే ఆహారమును దెచ్చెదను. నీకు ఆకలియగుచున్నదికాబోలు. ఇదిగో ఆహారము. ఇదిగో గంగాజలము. పాదప్రక్షాళనము చేయనిమ్ము. పవిత్రపాదోదకమును నాశిరస్సున జల్లుకొనుటకవకాశమును గల్పించినందులకెంతయో, సంతోషము. ఈ యాహారమును భుజించుము. అమ్మా, తినక యూరకున్నావేమి? నేనుకూడా భుజించవలయునని యూనీకోరిక. అట్లైన మనముభయులము కలిసియే భుజింతము.

అమ్మా యీయన్నముముద్దను నీవుతినుము. ఈ రెండవదానిని నేనుతినెదను. ఇదియేమి అన్యాయముతల్లీ, ఎందులకీ యాలస్యము. నీకాకలియగుటలేదా?" యనుచు, మనరామకృష్ణుడు జగన్మాతతో ననేకవిధముల కన్నతల్లితోవలె హృదయపూర్వకముగా మాట్లాడును. దినమంతయు జగన్మాత, గుణవిశేషవర్ణనలతోనే గడపును. సాయంకాలము కాగానే, జగన్మాతనారాధించుటకు, తిరిగి దేవాలయమున ప్రవేశించును.

చీకటి నలుదెసల వ్యాపించినందువలన, మనరామకృష్ణుడు దీపమునొకదానిని వెలిగించినాడు. దీపము వెలుగున జగన్మాతను సందర్శించినాడు. హారతి యిచ్చుటకు జగన్మాత చెంతకేగి "అమ్మా, కొంచెమాలస్యమైనది. క్షమించుము. హారతిగైకొనుము. ఆహా, యేమి నీరూపలావణ్యాతిశయమును. అమ్మా లోకసంరక్షిణీ, సర్వశక్తిస్వరూపిణీ, భగవతీ,

నమస్కారము. తల్లీ నీయనుగ్రహము, నాకెప్పుడు లభించునో? అమ్మా, యిప్పటికి జాము ప్రొద్దుపోయినది. శయనించుటకిదుగో పక్క." అనుచు ధూపదీప నైవేద్యాదులను ముగించును. తాను కూడా, యీ విధముగా తన దినచర్యను పూర్తిగావించుకొని శయనించును.

ఆహా, యేమి ఆయమాయికత్వము. పిల్లలు బొమ్మలతో యాడుకొనునట్లు, మన రామకృష్ణుడు జగన్మాతతో ఆడుకొనుటకు ప్రారంభించెను. ప్రతిదినము, ఉదయమున నిద్రలేచి, గంగానదియందు స్నానమాచరించును. వెంటనే జగన్మాత దేవాలయమునకు వచ్చును. తల్లిని ప్రార్థించును. వేడుకొనును. శరణుజొచ్చును. ఈవిధముగా రోజులు గడచినవి. మాసములు జరిగినవి. సంవత్సరములు పూర్తియగుచున్నవి. కాని తల్లియొక్క అనుగ్రహము మాత్రము లభింపలేదు. సశ్చేష్టితుడై, జగన్మాతయెదుట శ్రీరామకృష్ణుడు నిలచును. ఆనంద బాష్పము లా విశాల నేత్రములనుండి ముత్యములవలె జారిపడుచుండును. ఆహా, రామకృష్ణుని తన్మయత్వము. ఆహా, యేమి యాతని అనన్యభక్తి. భక్తుడన్న యిట్టివాడే కదా.

"అమ్మా, ఏమి నాకంఠ నాళములు బద్దలగుచున్నవి. దేహమంతయు మండిపోవుచున్నది. హృదయ పరితాపము హెచ్చగుచున్నది. అమ్మా, యింకయేల యీ యాలస్యము. నీయనుగ్రహము నాపై యొక్కసారి రానిమ్మా. రామప్రసాదుననుగ్రహించినది నీవే కాదా. భక్తుల హృదయములు నీ నివాసస్థానములు గాదా? బిడ్డ అమ్మాయని ప్రేమతో పిలచినంత మాత్రమున, తల్లి తన పనులన్ని మునుమాని, బిడ్డనా

దరించుటలేదా! కాని యెంత వేడుకొన్నను, యెంత ప్రార్థించి నను, యెంతరోదన మొనరించినను, నీకు నాయందు జాలిక లుగుటలేదే. అయ్యో, నేనెంత పాపిని. కోమలమగు నీహృ దయము సహితము నన్ను గురించి యింతకాఠిన్యము వహించి నదెందులకు? సూర్యుడు పశ్చిమదిక్కున గ్రుంకుచున్నాడు. నాజీవితము నందింకొక రోజు వ్యర్థముగా గతించిపోయినది. సంసార కూపమునుండి నన్నుద్ధరించగలవను నాశతో నిన్ను నేనాశ్రయించితిని. ప్రయోజనమేమియును గాన్పించదు" అని పలువిధముల హృదయపరితాపమును వెడల గ్రక్కును.

మన రామకృష్ణుని స్థితి నానాటికి విపరీతమగుచున్నది. దేహము శుష్కించిపోయినది. ఆహారమునందిచ్ఛలేదు. పై వస్త్రమున్నది లేనిది, రామకృష్ణునకు తెలియదు. కొన్ని వేళ లయందు దిగంబరుడై యుండును. మరికొన్ని వేళలయందర్ధ దిగంబరుడై యుండును. పరవశత్వమునందు, లోకమును మరచి, చిందులు ద్రొక్కుచుండును. అర్ధరాత్రులయందు పంచవటిజొచ్చును. తపస్సొనరించును. ఈవిధముగా దినక్రి మేణా ప్రపంచమునకు దూరుడై పోవుచుండెను. మనస్సంత యు జగన్మాతయందు లగ్నము కాబడినందువలన, పిచ్చివాని వలె కాన్పించెను.

మన రామకృష్ణుని స్థితినిగురించి, అందరికి విపరీతముగా దోచెను. కమ్రపురమునందున్న దల్లిగారికీతని విషయము తెలి సెను. ఇంటికిరావలసినదిగా ఆమె రామకృష్ణునికోరెను. రామ కృష్ణునికి పిచ్చియెత్తినదనుకొనువారు కొందరు. వివాహము చేసినగాని ఆపిచ్చి కుదురదనువారు కొందరు. ఏసుక్రీస్తు చెప్పియున్నట్లు కాముము, రామము యొక్కహృదయమునం

దుండజాలవు. భగవానుని మందిరమునందదుగిడనున్న మన గదాధరుని గురించి లోకము పిచ్చివాడని యనుకొనుటలో విశేషమేమియును లేదు. మన గదాధరుడుకూడా కొన్ని వేళలయందు తనకు పిచ్చియెత్తిన దనుకొనుచుండును. మరి కొన్ని వేళలందు తాను భగవద్భక్తి విశ్వాస విరాజితుడై నందువలన లోకమునకు తనపద్ధతులు రుచించుటలేదని తలంచును. ఈరోజులలో రామకృష్ణునకు ఆహారమునందిచ్ఛ పూర్తిగా నశించెను. నోటిలో అన్నముపెట్టి కర్రతో లోపలకు నెట్టినను అన్నము లోపలికి పోయెడిదికాదు. కనురెప్పలు పూర్తిగా తెఱచుకొని పోయినవి. కండ్లు రెప్పబారినవి. శరీరము మంటలెత్తుట ప్రారంభించెను. సహించలేక, తాపము చల్లార్చుకొనుటకాతడు గంగానదియందు దుముకును. వెంటనే తడివస్త్రములతో వచ్చి తల్లినిసమీపించి "అమ్మా, యిదియేమి ఆశ్చర్యము. నాసాధన నిన్ను సంతుష్టి పరచలేకున్నది. నాహృదయము నిష్కళంకమని నీవెరుగుదువుగదా! నాహృదయ వేదనలో నేను భస్మీపటలము గావలసినదేనా. నన్నిట్లు పరీక్షపాల్జేయుట నీకుధర్మమా? నీవీ సంసారసాగరమునుండి నన్నుద్ధరించలేవా? నన్నుద్ధరించుటకు నీకుశక్తిచాలదా?" అనుచుండును.

శ్రీరామకృష్ణునికి పసుకు జనించెను. నిస్పృహాత్వము కలిగెను. కాని అపారమగు ఆతని భక్తివిశ్వాసములు కార్యదీక్ష, ధైర్యసాహసములు, పెట్టనికోటలై, ఆతనికప్పుడు గలుగు నిస్పృహాత్వమును పటాపంచలు జేయుచుండెను. జగన్మాత మనరామకృష్ణునికి సాక్షాత్కరించు తరుణమాసన్నమైనది, కనుకనే విపరీతమైన హృదయ సంక్షోభము కలిగినది.

ఎఱ్ఱబారిన కన్నులతో కేశములన్నియు చెల్లాచెదరై భుజము లపైబడుచుండ, శరీరమందలి రక్తమంతయు సాధన తీవ్రతచే నింకిపోవుచుండ తప్పటడుగులతోను, అనన్యభక్తితోను, మరి యొకసారి దేవాలయమున ప్రవేశించెను. జగన్మాతకు నమస్కరించెను. అది యర్ధరాత్రి సమయము. ఈవిధముగా తల్లిని సంబోధింప ప్రారంభించెను. "అమ్మా, నీయనుగ్రహ ప్రాప్తి నాకింకను కాలేదు. నీ యనుగ్రహము లేకుండా, నేనీ ప్రపంచమందు జీవించలేను. ఈ రేయిగడచు లోపల నేను నీయనుగ్రహమును బడయుటయో లేక, ఈశరీరమును త్యజించుటయో జరుగవలెను. అమ్మా, నీ కొరకనేక సాధనలను జేసినాను. బంధుమిత్రులను విసర్జించినాను. నీవే నా సర్వస్వమనుకొన్నాను. నీవే నన్నుద్ధరింతువని తలంచినాను. ఇట్టినాయొక్క ఆత్మార్పణవలన కలిగిన ఫలితమేమి? ఇంతవరకు నీయనుగ్రహము నాపై కలుగకుండుటయే అటు ప్రపంచమునకు దూరమైపోయినాను. ఇటు నీకా నాయందనుగ్రహము కలుగలేదు. తల్లీ నేను జన్మించినది బ్రాహ్మణ జన్మ నాబుద్ధి మొదలైనవన్నియును నీపాదారవిందముల యందర్పించినాను. నీవులేని ప్రపంచము నాకు స్మశానవాటికయే. ద్విపాదపశువునై, ఐహికలంపటలయందు దగుల్కొని, కామినీ కాంచనములకు దాసుడనై నేనుండజాలను. సంపాదించితినా, నీయనుగ్రహమునే సంపాదించవలె. తద్వారా భగవత్ప్రాప్తిని బొందవలె. లేదా యీపాంచ భౌతిక శరీరమును వీడవలె. నీయనుగ్రహము లేకుండా యీప్రపంచమున నుండుటకు వీలే లేదు. నాభక్తి అనన్యమైనయెడల నాచిత్తము నిష్కళంకమైనయెడల నేనునిన్ను సందర్శించి

తీరవలె. లేదా నాహృదయ నాళములయందు ప్రవహించు రక్తముచే నీపాద ప్రక్షాళన మొనరించి దానితో నాశ్రితువును పూర్తిగావించుకొనవలె. నాప్రతిజ్ఞను గమనించి, నన్నుద్ధరించుము. లేదా నన్నాహుతిగా గ్రైకొనుము. తల్లీ యిక నాలస్యము చేయకుము. నేనీవేదనను భరింపజాలను. ముహూర్మాటికిని భరింపజాలను. తల్లీ యిప్పుడే, యీనాదేహమును, నీకాహుతిగా నొనర్చెదనని అత్యంతావేశపూరితుడై, కత్తి నూడబెరుకు కొనటకు జగన్మాతవైపునకు అడుగిడెను. వెంటనే వన రామకృష్ణుడు శరీరము తెలియకుండా క్రిందబడి పోయెను. ఆహా ఏమి యీవిచిత్రము!

కొంతకాలమైన తదుపరి ఈ యనుభవమును గూర్చి శ్రీరామకృష్ణుడు, తన శిష్యులతో నిట్లని చెప్పెను. "నేను జగన్మాత చెంతకు బోవుటలో క్రిందబడిపోతిని. అప్పుడు ఈప్రపంచ మంతయు తేజోరూపముగా పరిణమించినది. దానిమధ్య సౌందర్య మూర్తియగు నాజగన్మాతను గాంచితిని". శ్రీరామ కృష్ణునికిప్పటికి దేవి యనుగ్రహము లభించినది. జగన్మాత యనుగ్రహము లభించినవానికి కొరత యేమియున్నది? కాని, తిరిగి శ్రీరామకృష్ణుని హృదయ పరివర్తనము తెలిసి కొనుటకోయన, జగదాంబ యొక అర్ధరాత్రమున మృదుమధుర లావణ్యముతో ప్రకాశించు యొకసుందరాంగియై బంగారుపళ్లెరమున కొన్ని కనకాభరణముల నుంచుకొని దక్షిణేశ్వరమున శ్రీరామకృష్ణుడు శయనించియుండ స్వప్నమున గోచరించినది. వెంటనే రామకృష్ణుడు భయకంపితుడై దిగ్గునలేచి, జగన్మాతను సంబోధించి "అమ్మా, ఏమిది. ధన కనకరాసులా, నాకుబహుమానము.

చిన్నతనముననే తల్లిదండ్రుల విడనాడి వచ్చినందులకు నాకు ఫల మింతేనా? బంధువుల మాటలు లెక్క సేయక, నిన్ను నమ్మినందులకు నాకు లభింప దగ్గ దింతయేనా? అనేకమంది మిత్రులు నన్నున్మాదునిగా లెక్కించినను దానిని పాటిసేయక సేవయందు నియుక్తమై యున్నదానికి ఫలిత మిదియా? ఐహిక భోగములు తృణప్రాయములుగా విసర్జించి, పొందదగిన దిది యేనా? అమ్మా, వీటితో నన్ను సంతృప్తిపరచ జూచెదవా? నీ సుందర స్వరూపమును జూచిన కొలది నాకు మాతృభావ మెక్కుడగుచున్నది. ఐహిక విషయములచే నన్ను తృప్తి పరుపకమ్మా" యనెను. ఆహా! యేమి యీ హృదయపరివర్తనము! ఏమి ఈ నిశ్చలత! ఏమి ఈ భక్తివిశ్వాసములు! ఏమి ఈ కార్యదీక్ష! కామినీ కాంచనములను, స్మశానవాటిక యందలి బొగ్గురాసులనుగా తిలకించి, భగవత్సాక్షాత్కారమునకై, జగన్మాతయొక్క యనుగ్రహము ముఖ్యమని నమ్మి, నిరంతర భక్తి విశ్వాసములతో సంవత్సరముల తరబడి జగన్మాతను సేవించిన, రామకృష్ణునికి జగదాంబయొక్క యనుగ్రహము సంపూర్ణముగ లభించెను. శక్తి యనుగ్రహము లభించిన వానికి భగవత్ప్రాప్తియైనట్లే. రామకృష్ణుడు సంతోషచిత్తముతో జగన్మాతను కొనియాడుచు, బాలుడు తల్లియొద్దకు పరుగిడు చందమున, ప్రతి నిమిషము కాళియొద్దకు జనుచు, సంశయములను పోగొట్టుకొనుచు, కాలము గడపుచుండెను. ఇట్లుండ కొంత కాలమునకు భైరవీబ్రాహ్మణి యనునొక మహా తల్లి భగవదాజ్ఞానుసారము దక్షిణేశ్వరమున కేతెంచెను. వెంటనే శ్రీరామకృష్ణుని యొద్దకేగి, సోదర భావముతో, చిరపరిచయము గలిగినటుల, మాట్లాడ గడంగెను.

మరియు తాంత్రిక సాధనములన్నియు, రామకృష్ణుని కెరింగించి సంతృప్తిపరచెను. ఈ భైరవీబ్రాహ్మణి రామకృష్ణునిలో నిభగవల్లక్షణములను గాంచెను. ఈమహా తల్లి కొంతకాలము దక్షిణేశ్వరముననుండి రామకృష్ణునికి తాంత్రిక సాధనములన్నియు బోధించి వెడలిపోయెను.

ఇక్కడ నీవిధముగానుండెను. కమార్పురమునందు మన రామకృష్ణుని సోదరుడు, బంధువులు, రామకృష్ణునికి పిచ్చియెత్తినదనియు, వివాహ మొనర్చుటవలన ఆతని యున్మాదము తగ్గుననియు, నిర్ణయించుకొనిరి. బాలిక కొరకై యనేక గ్రామములలో విచారించిరి. కాని వీరికి బాలిక యెక్కడను లభించలేదు. ఈ తరుణమున, తల్లి యాజ్ఞానుసారము మన రామకృష్ణుడింటికి వచ్చెను. ఒకానొక దినమున యింటిలోని వారందరును, విచారగ్రస్తులై యుండుటను రామకృష్ణుడు కనిపెట్టెను. “అమ్మా మీరెందుకు విచారగ్రస్తులై యున్నారో, నాకు తెలియును. నాకు సహధర్మచారిణిగా నుండదగిన శారదాదేవియను పేరుగల కన్య, జయరామవటియనుగ్రామములో పెరుగుచున్నది. ఆమె తలిదండ్రులయొద్దకేగి, ఆమెను నాకిచ్చి వివాహము చేయుమని కోరుచో వారంగీకరింతురు” అని చెప్పెను. తల్లియును సోదరుడును ఆశ్చర్యపడినవారలై రామకృష్ణుని సూచనల నంగీకరించి శారదాదేవి యొక్క తలిదండ్రులతో సంప్రదించి వివాహ నిశ్చయ మొనరించిరి. ఒకానొక శుభముహూర్తమున శ్రీ శారదాదేవినిచ్చి రామకృష్ణునికి వివాహ మొనరించిరి. వివాహమైన కొలది దినములు మాత్రమే రామకృష్ణుడు క్రమపురముననుండి, తరువాత తిరిగి దక్షిణేశ్వరమునకు వచ్చెను.

యథా విధిగా మన రామకృష్ణుడు పూర్వమువలె జగన్మాత కొలుపు ప్రారంభించెను. సంపూర్ణ భక్తి చిత్తముతో కాళిని సేవించుచూ, లోకమంతయు కాళియొక్క స్వరూపమేయని యాతడు తలంచుచుండెను. తల్లి యనుటయే యాతనికి మహామంత్రి జపమాయెను. ప్రపంచమునకు, కామ్యకాంచనములే ముఖ్యబంధములని విశ్వసించి వాటిని నిరసించుచుండెడివాడు. స్త్రీ అపవిత్రురాలుకాదు. స్త్రీని అపవిత్రదృష్టితో జూచు నేత్రములు మాత్రము అపవిత్రమైనవి. స్త్రీ మాతృభావమును పెంపొందింపజేసి భగవత్సాక్షాత్కారమునకు మార్గము జూపు దివ్యజ్యోతి. కాని అట్టి జ్యోతి సహాయ్యమును పొందలేక నాజ్యోతి స్వరూపమునే మ్రింగజూచువారు.పండను భ్రాంతిచే దీపమును మ్రింగజూచు పురుగులవలె ఆజ్యోతిలో బడి నాశనమగుదురు. ఇటలీదేశములో డాంటి మహాకవి, బియాట్రీసను యువతిని, కామదృష్టితో జూచినప్పుడు మహాపరితాపము నొందెను. కాని హృదయపరివర్తనమైన తదుపరి బియాట్రీసును, మాతృసమానముగా జూచెను. మన రామకృష్ణునకు కూడ స్త్రీలను జూచినప్పుడెల్ల జగన్మాతయే గోచరించుచుండెడిది. రామతీర్థ స్వాములవారు హిమవత్పర్వతములలో సంచరించు కాలమున, అచ్చటి సృష్టిసౌందర్యమునుగాంచి, "మార్గమంతయు గులాబి పుష్పములచే శోభిల్లుచున్నది. ఈ పుష్పరాజముల దిలకించినప్పుడు భగవానుడే స్మృతికి వచ్చును. కాని ఆ పుష్పసౌందర్యమును జూచి యానందింపలేక పుష్పమునే హరింపబోయుచో అందలి నుండి ఒక తేనెటీగవచ్చి ముఖమును కుట్టు"నని వచించియున్నారు. అటులనే

ముగల మానవునికి భగవానుడే దృష్టికి వచ్చును. పవిత్రహృదయునకు జగన్మాతయే, ప్రతి స్త్రీయందును గోచరించును. అపవిత్ర హృదయముతో నిండి కామినీ దాసులగు వారికి నరక ద్వారములు మాత్రమే తెరువబడును.

మన రామకృష్ణునికి స్త్రీల యందుగల మాతృభావము మనలో నెందరికిగలదు! స్త్రీలను మాతృసమానులుగా జూడగలవారు ధన్యులు. అట్లు జూచుట యొక మహా సాధన. అట్లు జూడగలిగినవానికి ప్రపంచమంతయును, భగవత్పూజామందిరమగును. అట్లు జూడలేని వారికి యీవిశ్వమంతయు, స్మశాన వాటికయై, కామక్రోధాదులు ప్రతి నిమిషము మానవ జీవితమును దగ్ధమొనరించుచుండును.

మనరామకృష్ణుడు మాతృభావముతో నిండినవాడై, ప్రపంచములోని సర్వవస్తువులను మానవులందును భగవత్కళలనే గాంచుచుండెను. ధూర్జటి మహాకవివలె ప్రేమనాట్యమునే, ప్రపంచము నందంతట శ్రీరామకృష్ణుడు, వీక్షించగలిగెను. ఇప్పటికి శ్రీరామకృష్ణుడు, అద్వైతతత్వమును దప్ప, హైందవ సాంప్రదాయమునందున్న, మార్గముల నన్నిటిని, అనుభవమునకు తెచ్చుకొనెను. ఒకానొక దినమున భగవదాజ్ఞానుసారమో యనునట్లు, ఒక మహానభావుడు దక్షిణేశ్వరమునకే తెంచెను. ఈతని నామధేయము తోతాపురి. ఈతని నివాసస్థలము పంజాబురాష్ట్రము. ఈ మహానియుడు అద్వైతపరబ్రహ్మానుభవజ్ఞుడు. రాత్రులయందుమాత్రమే సంచారమొనర్చుచు, పగటికాలమంతయు నెచ్చటనో సమాధినిమగ్నుడైయుండును. జగన్మాతయొక్క ప్రేరేపణచే కొన్నాళ్లు, తోతా

అతని యోగక్షేమములను విచారించి, ఆసీనుడయ్యెను. మన రామకృష్ణునికి అద్వైత సిద్ధిపొందు మార్గము నుపదేశించుటకే తానక్కడకువచ్చితినని చెప్పెను. రామకృష్ణుడు తోతాపురి కేమియును, జవాబుచెప్పక జగన్మాత ఆలయమునకేగి, తోతాపురియొక్క అభిప్రాయమును తల్లికి నివేదించి, ఆమె యభిప్రాయమునడిగెను. ఆహా యేమి యీ ఆశ్చర్యము! ఏమి యీ అమాయకత్వము! 20 వ శతాబ్దమున, పాశ్చాత్యవిద్యాగర్వముచే, తమ్ము తాము మరచినవారికి, యీ నవనీత కోమలహృదయము, అర్థమగునా? టెన్నిసన్ మహాకవి "మాయుద్దేశ్యము లేవిధముగా, మావియో మాకు తెలియదు. కాని మాయుద్దేశ్యములను నీయుద్దేశ్యములయందు లయింపజేయుటకుమాత్రముమాకుహక్కుగలదు." అనుయున్నత భావమును, చెప్పియుండలేదా? "అహంయంత్రం, భవాన్ యంత్రీ" యను భారతి శ్లోకముకూడా, చెప్పునదదియేగదా. ఇట్టిభావములతో గూడిన వాడగుటవలననే, మనరామకృష్ణుడు బాలునివలె తల్లియొక్క అనుమతికొరకు పరుగెత్తెను. అచట యేమిజరిగినది మామూలు దృష్టికగపడుగాదు. కాని మన రామకృష్ణుడు తోతాపురియొద్దకు తిరిగివచ్చి, "అమ్మయాజ్ఞయైనది. కాన అద్వైతతత్వమును, తమ యిష్టానుసారము బోధచేయండి" అనెను. తోతాపురి సంతసించి' వెంటనే అద్వైత దీక్షనొసంగుటకుగాను, సుముహూర్తమును నిశ్చయించెను.

గంగానదియందు స్నానముచేసి వచ్చెను. తోతాపురి, మామూలుగా జరుపవలసిన హోమాది క్రియలను జరిపిన తరువాత, అద్వైతమహా మంత్రోపదేశమును జేసెను. శ్రీ

రామకృష్ణుని కా మంత్రీగ తత్త్వమును సువ్యక్తము గావించెను. తోతాపురి బోధించిన ప్రకారము, రామకృష్ణుడు ధ్యాననిష్ట కుగడంగెను. కొంతసేపటికి తోతాపురి, శ్రీరామకృష్ణుడున్న గదితలుపుమూసి బయటికివచ్చెను. లోపలయేమి జరిగినదో మనకు తెలియదు. కొంతకాలమునకు తోతాపురి గది తలుపు తెరచి, చూడగా, మన రామకృష్ణుడు సంపూర్ణ సమాధి నిష్టలోనుండెను. ఇది జూచుటకు తోతాపురి కేపూర్ణాశ్చర్యము కలిగెను. "ఆహా, నలుబది వత్సరములు, దివారాత్రములు సాధనగావించి, భగవదనుగ్రహముతో నేను పొందగలిగిన సమాధినిష్ఠను, యీ బాలుడు, మూడు దినములలో పొంద గలిగెనే? ఈతనిని గురించి నేనేమి తలంచవలయును? ఈతడు కేవలము అద్వైత పరబ్రహ్మమూర్తి యని చెప్పుట యందతి శయోక్తిలేదు." అని, రామకృష్ణుని సమీపించి, ఆతని శిర స్సుపై తన చేతినుంచెను. మన కథానాయకుడు సమాధిలో నుండి క్రిందికి వచ్చెను. తర్వాత తన యద్వైతానుభవ మును గురించి తోతాపురి కెన్నయో విషయములు నాయన జెప్పెను. అనేక వత్సరముల యనుభవముచే, తోతాపురి గ్రహించిన విషయములను, మన రామకృష్ణుడు మూడుదిన ములలో గ్రహించుటయేగాక, యింకా నూతన విషయముల నెన్నిటినో, గ్రహించెను. మూడు రోజులు మాత్రమే దక్షి ణేశ్వరమున నుండ సంకల్పించిన తోతాపురి, దాదాపు 6 మాసములచటనుండెను. శ్రీ రామకృష్ణుని వాగమృతమును గ్రోలుచుండెను. తుదకనేక విషయములను మన రామ కృష్ణుని యొద్ద నేర్చుకొని, తోతాపురి దక్షిణేశ్వరమును విడచి వెళ్లెను.

ఇప్పటికి శ్రీరామకృష్ణుడు జగన్మాతయొక్క యనుగ్రహముచే, తాంత్రిక సిద్ధితో బాటు అద్వైత సిద్ధిని గూడ బడసెను. అరిషడ్వర్గముల జయించి కామ్యము వర్జించి ఆశాపిశాచము నణగద్రొక్కి జీవన్ముక్తుడై, అజ్ఞానాంధకారమున గాఢమైన మేఘములో మెరుపువలె ప్రకాశించెను. పాంచభౌతిక దేహముండగనే విదేహముక్తుడై అవస్థాత్రయమును దాటివిలక్షణుడై ప్రకాశించెను. ఆహా! యేమి ఆమూర్తిస్వరూపము! ఏమి ఆ నిష్ఠ! ఏమి ఆ ప్రజ్ఞావిశేషము. దేహమంతయు నూతన కాంతులతో ప్రకాశించుచున్న మన రామకృష్ణుని ముఖమండలముపై సూర్యునిపగిది జ్ఞానభాస్కరుడు ప్రకాశించుచున్నాడు. అజ్ఞానాంధకారమున చంద్రోదయమైనట్లు మన రామకృష్ణుని ప్రతిభ ప్రకాశించుచున్నది. చకోరపక్షులు వర్షప్రసీతిచే తెలివితెచ్చుకొనునట్లు మన రామకృష్ణుడు జ్ఞానామృతపానముచే ఆనందాబ్ధియందు భావతరంగములలో ప్రకాశించుచున్నాడు. మహాచక్రవర్తి రసక సింహాసనముపై నెమలిపింఛముదాల్చి ప్రకాశించునట్లు, అద్వైతసామ్రాజ్యమున అనుభవజ్ఞానముచే, మన రామకృష్ణుడు ప్రకాశించుచున్నాడు. ఇమ్మహనీయుని అనుభవ జ్ఞానము ప్రపంచమునకు వెల్లడియగు సమయమింకరాలేదు. కాని రాబోవుచున్నది.

శ్రీరామకృష్ణుని అర్ధాంగి శ్రీశారదాదేవియని వచించియుంటిమి గదా! ఆమె రజస్వలయై యుక్తవయస్కురాలు కాగా తన భర్తను గురించి తల్లిదండ్రులను ప్రశ్నించినది. విషయమంతయు తెలిసికొనినది. తుదకు సాహసించి, దక్షిణేశ్వరమునకు బయలు వెడలినది. కాళికా దేవాలయము

ను సమీపించి, తన్మయుడై యున్న శ్రీరామకృష్ణుని గాంచెను. హృదయమునందు భావతరంగములు పొంగిపొరలెను. కండ్లనుండి ఆనందబాష్పములు కారెను. శ్రీరామకృష్ణుని యొద్దకు వెళ్లి సాష్టాంగనమస్కారము చేసెను. మాతృభావనిమగ్నుడై యున్న రామకృష్ణుడామెను తల్లియని సంబోధించెను. శారదాదేవియొడలు పులకరించెను. ఆమె హృదయక్షేత్రమున నాటుకొనియున్న భావలతలకు నూతన పుష్పములు పూచెను. ఆ పుష్పసుగంధము వలన అజ్ఞానము హరించెను. మోహము భక్తిగా మారెను. కామ్యము నిష్కామ్యమాయెను. ఐహికభోగములాధ్యాత్మికచింతలాయెను. మందహాసము చేసి, ఆనాడు మైత్రేయి యాజ్ఞవల్క్యునితో వచించినట్లు "ఆత్మరాజ్యమున అర్ధాంగినిగా నుండుటకే, యిటకు వచ్చితిని. తమశుశ్రూషయే నా జీవితముఖ్యకర్తవ్యము. తమ సేవకురాలనై, మహదానందములో, నిమగ్నము కాగల భాగ్యమును, నాకు కలుగునట్లనుగ్రహింపుడు. ఇపుడు పరబ్రహ్మమునందైక్యమైనట్లు నేను తమయందైక్యము కావలయును. కనికరించి నన్ను సేవకురాలిగా గ్రహింపుడు." అని శారదాదేవి గద్గదకంఠముతో వేడుకొనెను.

మన రామకృష్ణుడు వెంటనే జగన్మాతయొద్దకు వెళ్లి శారదామణియొక్క కోర్కెను ఆమెకెరిగించెను. తల్లి ఆ యేర్పాటున కంగీకరించెను. శ్రీశారదాదేవి దక్షిణేశ్వరమున నుండునట్లేర్పాటు చేయబడెను. వీరి దాంపత్యము ఆత్మసంబంధమైనది. మాతాపుత్రులవలె, సోదర సోదరీమణులవలె, వీరా దేవళమున కాలముగడిపిరి. ప్రతిదినమున, రామకృష్ణుడు అనుగ్రహముకొరకు జగన్మాతను ప్రార్థించుచుండెడివాడు.

ఆహా! ఏమి యీ దాంపత్యము. జీవబ్రహ్మైక్యానుసంధాన మన నిట్టిదియే కాబోలు. సముద్రమున ప్రవేశించిననది తన స్వస్వరూప రాహిత్యమును బొందునట్లు, మన శారదాదేవి రామకృష్ణుని సందర్శించి నంతనే, తన వ్యక్తిత్వమును పూర్ణముగా లీనముచేసినది. ఇట్టి అన్యోన్య సంబంధ బాంధవ్యములు స్త్రీపురుషులమధ్య పెంపొందుచో భూలోకము స్వర్గధామముగా మారునని చెప్పుటలో అతిశయోక్తిలేదుగదా. ఉపనిషత్కాలమున, యాజ్ఞవల్క్యునికిని మైత్రేయికిని, జ్ఞానోదయమైన తదుపరి యేర్పడిన సంబంధమిట్టిదేగదా! ప్రస్తుతము మహాత్మాజీకిని కస్తూరి బాయికిని కల సంబంధముకూడ ఇట్టిదియేకదా!

అచిరకాలములోనే, రామకృష్ణుని నామము బంగాళా రాష్ట్రమందంతయు వ్యాపించెను. అనేకులాతనిని భగవదవతారముగా పరిగణించిరి. మరికొందరాతడు కేవలముపిచ్చివాడనిరి. రామకృష్ణుని పరీక్షించుటకై, కుక్షింభరులు, శుష్క వేదాంతులు, తాంత్రికులు మొదలగు వారనేకులు దక్షిణేశ్వరమునకు వచ్చిరి. జగన్మాత కృపచేతను, రామకృష్ణుని ఆత్మవిశ్వాసముచేతను, వారందరు రామకృష్ణుని గురించిన యాథార్థ్యమును తెలుసుకొన గలిగిరి. పండితులాతని నిష్కళంక భక్తి విశ్వాసముల కచ్చెరువొందిరి. ఛాందోగ్యోపనిషత్తునందు చెప్పబడినట్లు ఒకమృత్పిండమును తెలుసుకొనుటలో సమస్త మృత్స్వరూపము దెలియునట్లే, రామకృష్ణుడు విద్యలకెల్ల మూలమగు భక్తివిద్యను, జగజ్జనని యనుగ్రహము వలనను, ఎడతెగని సాధనవలనను, తెలుసుకొని యున్నందువలన అందరిని మెప్పించగలిగెను. భగవత్కృపగల

వానికి విశ్వతత్త్వమంతయు కరతలామలకమగును గదా. మన రామకృష్ణుని విద్య ప్రహ్లాదుని విద్యవంటిది. రామకృష్ణునిభక్తి కూడ ఆతని భక్తి వంటిదే. సంసారమను చీకటినూతిలో బడక, లోకమంతయు సర్వేశ్వరుని దివ్యకళామహిమావిరాజితముగా భావించి భేదభావములేకుండ ప్రవర్తించిన వాడే మన రామకృష్ణుడు. కుక్షింభరత్వమే ప్రధానదృష్టిగల పండితులో, రామకృష్ణుడే చెప్పినట్లు, తర్కగగనమండలమున గద్దలవలె సంచరించువారు. వారెంత యున్నతవీధుల సంచరించినను, వారి దృష్టి కామినీకాంచనములమీదనే యుండును. అందువలననే వారి విద్యవలన భగవత్సాక్షాత్కారము నెన్నటికిని కలుగుటలేదు.

రామకృష్ణుడు తనకుగలిగిన ఉన్నతవిజ్ఞానమునకు గర్వించలేదు. సాక్రటీస్‌వలె యేమియు తెలియనివాడనని యే భావించుచుండెను. అత్యణకువతో న్యూటన్ మహనీయునివలె తన కోమలహృదయమును తెరచి, ప్రపంచతత్త్వము నెక్కుడు గ్రహించుటకే ప్రయత్నించెను. ఇప్పటికి హైందవవిజ్ఞానమంతయు గ్రహించి, ఆర్యధర్మానుష్ఠానము నందారితేరి, అన్యమత సత్యాసత్యములను తెలుసుకొను కుతూహలముగలవాడాయెను. బౌద్ధ, క్రైస్తవ, మహమ్మదీయ మతతత్త్వము లుగ్రహింపబూనెను. ఆయా మతములయందు సూచింపబడిన ముఖ్యధర్మముల ననుష్ఠించి బుద్ధుని, క్రీస్తు, మహమ్మదును తనహృదయమునందు ఐక్యానుసంధాన మొనరించుకొనితద్వారా వారియందులీనమై, ఆమతములయొక్క హృదయమును తెలుసుకొనగలిగెను. ఇస్లామ్ మతప్రవక్తయగు మహమ్మదువలె ఆయన విద్యావిహీనుడయ్యు విజ్ఞానమునుబొందగలిగెను.

ఏసుక్రీస్తువలె హృదయకోమలత్వమును పరిపూర్ణవిశ్వాసమును గలవాడై క్రీస్తుతత్త్వమును సాక్షాత్కరించగలిగెను. బుద్ధభగవానునివలె కరుణారసపూరితుడై విశ్వమును సామరస్యదృష్టితో సమన్వయించగలిగెను. కనుక మనరామకృష్ణుడు హైందవ, బౌద్ధ, క్రైస్తవ, మహమ్మదీయ విజ్ఞాన సమ్మేళనుడాయెను.

నీటిని హిందువులు దకమనియు, మహమ్మదీయులు పానీయనియును, ఇంగ్లీషువారు వాటరనియును వేర్వేరు నామములతో వ్యవహరించినను వస్తువొక్కటేయైనట్లు, భగవంతుడు వివిధనామములతో పిలువబడుచున్నను, భగవత్పదార్థమొక్కటేనని అనుభవజ్ఞానమువలన రామకృష్ణుడు గ్రహించగలిగెను. రామకృష్ణుని యునికివలన దక్షిణేశ్వరమునకు శోభవచ్చెను. అనేకులువచ్చి రామకృష్ణుని సందర్శించి పోవుచుండెడివారు. హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, యింకా యితరులు శ్రీరామకృష్ణుని సామరస్యభావము ననేకవిధముల గొనియాడుచుండెడివారు. శ్రీరామకృష్ణుని కామినీకాంచన విముఖత్వము, త్యాగశీలము మొదలగులక్షణములు వారి ననేకవిధముల నాకర్షించెను. భౌతిక శరీరపోషణమునకన్న యెక్కుడుపయోగము ధనమునకు లేదని తెలుపుటకోయాన బంగారు నొకచేతను, మంటినొకచేత పట్టుకొని, రెంటిని మిశ్రముచేసి, ఆత్మాభివృద్ధికనుకూలపడని వస్తుసముదాయమని మనస్సునకు సంబోధించి, హుగ్లీనదియందు పారవేయును. సర్ థామస్ మూర్ ఉటోపియా యనుగ్రంథమున ఆదర్శప్రాయమైన మానవసంఘమును సృజించెను. అదిభూలోకస్వర్గమే. అచ్చట బంగారము సంకెళ్ళను వేయుటకుమాత్రమే యుపయోగించబడునని చెప్పి

నాడు. అనగా బంగారువందు మానవునకంతి కాంక్షయుండ రాదనియే ఆయన సూచన. ఆశాపిశాచము నరికట్టుటకే రామకృష్ణుడు బంగారును, మట్టితో సమానముగా చూచుట కలవాటుచేసుకొనెను. ఇంతయేల? గాఢసుషుప్తి యందున్న ప్పుడు సహితము మారామకృష్ణుని భౌతిక దేహమునకు బంగారు తాకించినచో ఆభాగము ముడుచుకొని పొక్కులును, లేక యెక్కువ బాధ కలిగించుటయు జరుగును. ఆహా! ఎంత ఆశ్చర్యము? అభ్యాసమువలన రామకృష్ణుడు కామినీ, కాంచనములను జయించి, భగవదనుగ్రహమును బొందగలిగెను. కనుక భారతీయులందరును, తమపూర్వ చరిత్రమును జ్ఞప్తికి దెచ్చుకొని, భారతజాతి పరమావధి భగవత్సాక్షాత్కారమేనని శ్రీరామకృష్ణునివలె, అందరును విశ్వసించుచో భారతభూమి ఉపనిషత్కాలములోవలె స్వర్గధామముగా మారునుగదా.

రామకృష్ణుని సాధన పూర్తియైనది. జ్ఞానులలో మహాజ్ఞాని, భక్తులలో మహాభక్తుడు, యోగులలో మహాయోగియై శ్రీశుక, నారద, ప్రహ్లాదులవలె దక్షిణేశ్వరమున జ్యోతిస్వరూపుడై పలువుర నాకర్షించుచుండెను. సమాధిస్థితి శ్రీరామకృష్ణుని కతిమామూలాయెను. ఒకానొకదినమున సమాధియందు క్రిందిదృశ్యమును, ఆతడు జూచెను. సప్తసముద్రములు దాటినతరువాత తపోనిష్ఠానిమగ్నులైయున్న, సప్తమహర్షులు కాన్పించిరి. శ్రీరామకృష్ణుడు వారిచెంతకేగి, వారిలోనొక మునిపుంగవుని నేత్రములు తెరచుటకు ప్రయత్నించెను. అమ్మహర్షి అర్ధనిమీలిత నేత్రములతో మనరామకృష్ణునిజూచి వెంటనే నేత్రములను మూసుకొనెను. ఆయన నేత్రములనుండి,

ఒక మహత్తర తేజస్సు బయల్వెడలి, ఆకసమున కేగసెను. గగనమార్గమున ఆ తేజస్సు కాశీక్షేత్రము చేరి, విశ్వనాథాలయమునందు ప్రవేశించి, విశ్వేశ్వరుని పూజలయందు నిమగ్నురాలై యున్న, విశ్వనాథ దత్తుగారి సహధర్మచారిణి యగు భువనేశ్వరీమాత గర్భమున ప్రవేశించెను. ఈసమాధిదృశ్యము చాల విచిత్రముగానున్నది. సమాధియందు సప్తమహర్షులుగాన్పించుట- యోగనిష్ఠలోనుండుట- మనరామకృష్ణుడు వారిని సమీపించుట-సమీపించుటలో శ్రీరామకృష్ణుని దివ్య సంకల్పము- మహర్షులలో నొకరు నేత్రములను తెరచుట- తేజస్సుబయలుదేరుట-గగనమార్గమున కాశీక్షేత్రము చేరుట- భువనేశ్వరిమాతగర్భమున ప్రవేశించుట- ఇదంతయును మానవుని సామాన్యబుద్ధికి అర్థముకాని విషయముగదా!

ఈ సతి ఎవ్వరు? ఈ మహాతల్లి యేమి నోములునోచినది? మనదృష్టి నొక్కపర్యాయము కలకత్తావైపునకుమరల్చవలెను. విశ్వనాథదత్తు కలకత్తాపట్టణమునందొక గొప్పన్యాయవాది. భువనేశ్వరీమాత ఆతని భార్య. వారికిభాగ్యభోగ్యములకు లోటులేదు. కాని, పుత్రసంతానార్థులై యుండిరి. పుత్రప్రాప్తికై భగవదనుగ్రహమును బడయుటకే భువనేశ్వరిమాత కాశికానగరమునకు విశ్వనాథునారాధించుటకు వెళ్లినది. ఆయమ యుపవాసదీక్షలోనుండి విశ్వనాథ పాదారవిందలగ్నచిత్తయై, శయనించియుండగా, ఆకాశమార్గమున వచ్చిన దివ్యతేజస్సామెగర్భ గోళమున ప్రవేశించెను. అదియునుగాక విశ్వనాథుడు ప్రత్యక్షమై, ఆమెభక్తి విశ్వాసములచే తృప్తుడైనట్లును, తానే ఆమెగర్భమున నవతరింతుననియును, చెప్పెను. గదాధరుని యనుగ్రహముచే మన రామకృ

ష్ణుఁడు లోకోద్ధరణ జేయుటకు జన్మించెను. శ్రీరామకృష్ణుని సంకల్పముచే, మహర్షి నేత్రమునుండి బయల్వెడలిన, దివ్యతేజస్సు విశ్వనాథుని అనుగ్రహముచే, భువనేశ్వరీ మాత గర్భమున, శ్రీరామకృష్ణుని లీలలయందు పాల్గొని, తదవతార ఘట్టమును పూర్తిజేయుటకు నరేంద్రుఁడను నామాంతరము గల వివేకానందుఁడు జన్మించెను. గదాధరుఁడు విష్ణుస్వరూపుఁడు, విశ్వనాథుఁడు శివస్వరూపుఁడు. శివకేశవులు ఒకే మహామూర్తి యొక్క యంశావిరాజితులు. వారిరువురికిని గలభేదము కేవలకల్పితము. నిమిత్తమాత్రము. శివకేశవులకు గలయభేదమును చాటుటకో యన గదాధరవిశ్వనాథులు, రామకృష్ణ వివేకానందులుగా నుద్భవించిరి. కనుక రామకృష్ణ వివేకానందులకు గలభేదముకూడ కల్పితమే.

గదాధరుని యనుగ్రహమున పుట్టిన వాఁడగుటచే అతఁడు గదాధరుడని బాల్యమున వ్యవహరింపబడెను. విశ్వనాథుని యనుగ్రహమువలన పుట్టిన బిడ్డయగుటవలన, వివేకానందుఁడు బాల్యమున, నరేంద్రుడని వ్యవహరింపబడెను. నరేంద్రుఁడు నిజముగా, మానవులలో రాజుగానేయుండెను. దేవతలలో ఇంద్రుని ప్రకాశమువలెనే, నరులలో నరేంద్రుని ప్రకాశముండెను. ఆహా! యేమి ఆనరేంద్రబాలుని ముఖలావణ్యము, విశాలనేత్రములు. బాల్యమునుండియు, నరేంద్రునిలీల లత్యద్భుతములు. బాల్యమాది యీతఁడు, తలిదండ్రులచే అతిగారాబముగా పెంచబడెను. బాల్యమాది నిద్రిసమయములందు, నరేంద్రుని కత్యద్భుతజ్యోతి దర్శనమగు చుండెను. తరుచు దేవళమునకేగి, కనులుమూసుకొని, భగవధ్యానమునందు నిమగ్నుఁడై, యోగిపుంగవునివలె తోటిబాలురకు గాన్పించెడి

వాడు. ఒకానొకదినమందు, నరేంద్రుడు పూర్ణధ్యాన నిష్ఠలో నుండగా, పామొకటి ఆతని యొద్దకువచ్చెను. దానినిజూచిన వారందరు భయభ్రాంతులై కేకలిడినను, నరేంద్రుని ధ్యాన నిష్ఠాభంగము కలుగలేదు. ఆతనికి పాము విషయ మేమియును దెలియదు. నిమిషములో ఆపాము అదృశ్యమాయెను.

నరేంద్రుని తెలివితేటలు అత్యద్భుతము. విద్యావిషయములలో మొదటినుండియు నరేంద్రుని శ్రద్ధాభక్తులు వర్ణనాతీతము. మెట్రిక్యులేషను పరీక్షయందుత్తీర్ణుడాయెను. ఎఫ్. ఏ. పరీక్షకుచదివి, రెండువత్సరములు పూర్తికాగానే, బి. ఏ. పరీక్షకుచదువుటకు కళాశాలయందు జేరెను. నరేంద్రునికి తత్వశాస్త్రమన్న యభిరుచిమెండు. స్పెన్సరు, కాంటు, మిల్, మొదలగువారి గ్రంధముల నితడుపఠించెను. విశ్వపరిపాలన కర్తయొకడు గలడనియును, ఆతని స్వరూపమును, ఆతని తత్త్వమును, మహిమావిశేషములను తెలుసుకొన వలయుననియు కుతూహలముజనించెను. బ్రహ్మసమాజమునందు జేరి, కొంతకాలము కేశవచంద్రసేనునితో కాలముగడపెను. అందువలన నరేంద్రునికి చిత్తశాంతి లభించియుండలేదు. ఆతని మనస్సంతయు సంశయములచే నిండిపోయెను. సంశయములు తుపానువలె నానావిధముల చెలరేగెను. అంతయు ఆందోళనమే. దారిడొంకకాన్పించదు. అజ్ఞాన గాఢాంధకార మొకప్పుడాతనిని నాస్తికునిజేయును. వెంటనే మెరుపు మెరసినట్లు కొంతవరకు దారిగాన్పించును. మరికొంత సేపటికంతయు అంధకార బంధురమగును. ఇట్టి భావములకు నరేంద్రుడు వశుడాయెను.

ఇట్టి స్థితియందున్నప్పుడే, మన నరేంద్రుడు, స్పెన్సరు తత్వశాస్త్రజ్ఞుని గ్రంథములను పఠించి, తన భావములను వెలిబుచ్చుచు, ఆతనికొక యుత్తరమును వ్రాసెను. ఆయుత్తరమునకు స్పెన్సరు అచ్చెరువంది, నరేంద్రుని అత్యద్భుత తెలివితేటలకు సంతోషించి, మున్ముందాతడు మహత్తరమైన స్థితికి రాగలడని తెలియజేసెను. నరేంద్రునికి పట్టుపరీక్షసమీపించుచున్నది. హృదయమున ఆందోళన మాత్రము తగ్గలేదు. ఆతని బాధించు ప్రశ్నలు రెండుమాత్రమే. (1 భగవానుని ఎవరైన గాంచిరా (2) ఆసత్యస్వరూపిని దన కెవరైన జూపగలరా. ఒకపుడు మహర్షి దేవేంద్రనాథఠాకూరు నీప్రశ్న జేసెను. కాని వారి జబాబుచే తృప్తికలుగలేదు. ఆందోళన హెచ్చయ్యెను. ఇట్టి సందర్భములో ఆతని మేనమామ దక్షిణేశ్వరమునయున్న నొక మహానుభావుని సందర్శించినచో సంశయములన్నియు దొలగి శాంతిచేకూరునని చెప్పగా నరేంద్రుడట్లేయని దక్షిణేశ్వరారామమును జేరి యచట శ్రీరామకృష్ణుని సందర్శించెను. గాంచినంతనే నరేంద్రునకు గలిగిన భావమేమి! రామకృష్ణుడొక పిచ్చివాడనియు ఆయన వలన దన సందేహములు దీరునాయనియు. ఇట్టి సంశయచిత్తముతోనే "బాబాజీ తాము భగవంతుని జూచినారా! ఆసత్యస్వరూపుని నాకు జూపగలరా" యని నరేంద్రుడు ప్రశ్నించెను. వెంటనే రామకృష్ణుడు మందహాసవదనముతో దనవామహస్తమును నరేంద్రుని శిరముపైనుంచెను. వెంటనే ఈజగత్తంతయు పరిణామదశనొందినట్లతనికి గాన్పించెను. ఆస్థితి యనిర్వచనీయముగనుండెను దానిని నరేంద్రు డిట్లు నిర్వచించెను. 'రామకృష్ణుడు నాతలపై చెయినిడగనే నామరూపాత్మక జగత్తునందలి ప్రీతియు

కువును సంచలనమంది, మిథ్యాజగత్తు తేజోస్వరూపమై ప్రకాశించెను. మాయనతిక్రమించి నామానసమానంద తరంగములపై దేలియాడుచుబోయి యాదివ్యజ్యోతిలో లీనమైనట్లు తోచె. అదియే యాత్మానుభవము కాబోలు. కొంతకాలమునకు మరల నీజగత్తుకనుపట్టెను" రామకృష్ణుని స్పర్శచేతనే అద్వైతసిద్ధికలుగుచుండెను! ఏమిమహిమ!

పాశ్చాత్య శాస్త్రవాసనగల నరేంద్రునకదియంతయు గారడిగాతోచెను. ఇట్టి డోలాందోళితచిత్తముతో నరేంద్రుడు గృహాభిముఖుడయ్యెను. కాలముగడచిన కొలదిని నరేంద్రునకు దక్షిణేశ్వరమందును, అచటి ప్రవక్తయందును అనిర్వచనీయమగు ప్రీతియేర్పడెను. ఈయాకర్షణకు కారణమేమియో తెలియకుండెను. పరీక్షలు సమీపించుచున్నను నాతడుతరచుగా దక్షిణేశ్వరమును సందర్శించి రామకృష్ణునివాకమృతమును గ్రోలుచుండె. హృదయకమలము వికసించిన కొలదిని అనుమానము లంతర్ధానమగుచుండె. పగలంతయు విశ్వవిద్యాలయమునను, సాయంకాలము బ్రహ్మసమాజ మందిరమునను, ఆదివారములు దక్షిణేశ్వరమందును గడచుచుండె. రాత్రులయందొకవైపున తేయాకు పానీయమును వేరొకవైపున గ్రంథములను బెట్టుకొని త్రాటితో కాలినిగట్టివైచుకొని దీపమువద్ద కూరుచుండి పరీక్షలకు జదివి కృతార్థుడయ్యెను. బంధువులీతని న్యాయకళాశాలయందు బ్రవేశపెట్టిరి ఆకాలముననే తండ్రిగారు గతించిరి. ఇంటివద్ద పరిస్థితులు నానాటికి విషమించుచుండెను. తన తండ్రి కాలమున సుఖముగ నుండిన కుటుంబమిపుడు బీదత్వముచే కడుపున కన్నమునకును గట్టగుడ్డకును గరవై పలుకష్టములబడుచుండెను. అపుడ

పునుపవాసములు చేయవలసివచ్చెను. ఈచిక్కుల నివారణకై నరేంద్రుడేదైన యుద్యోగము దొరకునేమోయని కచేరీలన్నియు కలయదిరిగెను గాని ప్రయోజనములేదయ్యె. దైవమేమైన పరీక్షించుచుండెనా? లేక విధికృతమా! అట్లుకాదు. నరేంద్రుడొనర్పవలసిన మహత్తరకార్యము వేరొకటుండ ఉద్యోగదాస్యత్వమున నాతడెట్లు బంధింపబడును! ప్రపంచమంతటికిని శ్రీరామకృష్ణ సందేశమును చాటవలసిన ధీరుడు కాంచనమునకు దాసుడెట్లుకాగలడు. విశ్వమును ఆనందవార్ధి నోలలాడించవలసిన భక్తాగ్రేసరుడు భుక్తికై తన జీవితము నమ్ముకొనగలడా! విశ్వోద్ధరణ సామర్థ్యముగల నరేంద్రుడు, విజ్ఞాన చంద్రికల నలుదెసల వెదజల్లుటకు మారుగా సంసార నిర్వహణమునకై యుద్యోగియగునా? భగవదుద్దేశ మదికాదు.

సంసారమున దారిద్ర్య మెక్కువయ్యెను. నరేంద్రునకేమి చేయుటకును దోచదయ్యెను. ఒకనాడు మధ్యాహ్నము సమస్తముస్సజించి భగవానునిపైభారమిడి తిరిగిచూడకొక చిన్నిలోటాసుమాత్రము గైకొని దక్షిణేశ్వరారామమునకు బరుగిడివచ్చి తనవేదన నంతయు రామకృష్ణున కెరిగింప నాతడు నరేంద్రుని జెంతజేర్చుకొని బడలికదీర్చి యిరువురును నాజగన్మాతయగు కాళీమూర్తిని ప్రార్థించిరి. పిమ్మట నరేంద్రుడు సన్యసించెను. ఆహా! యేమిమార్పు. ఇదంతయు భగవత్సంకల్పము. కానున్నది కాకమానదు. కానిది కానేరదు. భౌతిక సామ్రాజ్యాధిపత్యము వహింపదగ్గ నరేంద్రుడు ఆత్మరాజ్యమున బ్రవేశించెనుగదా. భౌతికసుఖలంపటుడై ప్రపంచమను కమ్మరశాలయందు సమ్మెట దెబ్బలు తినుటకు మారాత్మసామ్రాజ్యమున నూతన ప్రభలతో నరేంద్రుడు వివేకా

నందుండై ప్రకాశించెను. రామకృష్ణ వివేకానందులది సంసార బంధము కాదు. అది ప్రేమబంధము.

క్రమముగ దక్షిణేశ్వరము యువకులకొక తీర్థమయ్యెను. రామకృష్ణుని వాగమృతమును గ్రోలి 17 గురుకాషాయముల ధరించి తమ జీవితముల మానవోద్ధరణకై వినియోగింప నిశ్చయించిరి. వీరందరియందు రామకృష్ణుని యొక్కొక్క గుణము మూర్తీభవించెను. వీరిలో గొందరు జ్ఞానులైరి. కొందరు భక్తులును, మరికొందరు యోగనిష్ఠాపరులును, వేరొక కొందరు నిష్కామసేవను బూని మోక్షకాములునైరి. వీరందరును దమగురువుచెంతజేరి ననేక విషయముల బొరంగతులైరి. నక్షత్రములనడుమ చంద్రబింబమువలె శిష్యగణమునడుమ రామకృష్ణుడు పదునారుకళలతో విరాజిల్లుచుండెను.

వీరిలో మహేంద్రనాథగుప్తయను నొక శిష్యుడుగలడు ఆతడు గృహస్థుడు. ఉపాధ్యాయపదవి నందుండి వీలైనపుడెల్ల ఆరామమునకేతెంచుచు నచట జరుగు ప్రసంగములెల్లను వంగభాషలో నాలుగు సంపుటములలో హృదయంగమముగ వర్ణించియున్నారు. అందలి రెండుభాగములాంగ్లేయమునను ఒక భాగమాంధ్రమునను ముద్రింపబడినవి. గ్రీసుదేశమునకు జ్ఞానచక్షువైన సోక్రటీసుయొక్క బోధలను ప్లేటోపండితుడు ప్రశ్నోత్తర పూర్వకముగా మానవుల కందజేసినట్లే మహేంద్రనాథుడు శ్రీరామకృష్ణుని బోధామృతమును మన కొసంగి యెంతయో మేలుసలిపినాడు. ఇట్టి గ్రంథముల నాంధ్రులందరును పఠించి ధన్యులయ్యెదరుగాక.

వంగదేశమున నాకాలమున బరమహంసవారి సందర్శన భాగ్యమబ్బిన మహాపురుషులలో బ్రహ్మానంద కేశవ

చంద్రసేనులొకరు ఈతడు మహాభక్తుడు, బ్రహ్మసమాజమతమునకు బట్టుగొమ్మ. అంత్యకాలమున రామకృష్ణునిచే యుద్ధరింపబడిన భాగ్యశాలి. హుగ్లీనదిపై బడవలో ననేక మార్లు యిరువురకు భగవత్సంభాషణలు జరిగియుండెను.

శ్రీరామకృష్ణుడు సందర్శించిన మరొక మహాపురుషుడు ఈశ్వరచంద్రవిద్యాసాగరులు. ఈతడు తన జీవితమంతయు, అబలారత్నములను, బాలవితంతువులను, బాలికలనుద్ధరించుటలో గడపెను. వారికొక ప్రత్యేక కళాశాలను నిర్మించెను. నిరంతర సేవాతత్పరుడై ఉయ్యాలనూచు చెయ్యియే ప్రపంచమును బాలించుచున్నదని యెఱింగి వారికై పాటుబడెను.

వివేకానందుడొకనాడు నిర్వికల్పసమాధియే పరమపురుషార్థమని తలచి నిశ్చలచిత్తముతో సాధనజేసి బాహ్యప్రపంచమును మరచెను. ఉచ్ఛ్వాసనిశ్వాసములాగెను. రామకృష్ణుడావిషయము నెఱింగి శిష్యుల భయమును బాపి వివేకానందుని "సంసారతాపతప్తులగు వారికి విశ్రమస్థానమవగుదువని యాశించిన నీవిట్లు స్వసుఖమును గోరుట తప్పని" మందలించెను. వివేకానందుడు తన స్వార్థమునకు లజ్జించి సమాధిమాట దలపెట్టక మానవసేవాదీక్షను సంకల్పించె. ఇట్టిదిగదా మహాపురుషుల సత్సంగభాగ్యము.

క్రమముగా రామకృష్ణుని ఆధ్యాత్మిక జ్ఞానమంతయు దండ్రియాస్తి కుమారులకువలె ప్రియశిష్యుడగు వివేకానందునకు జేకూరెను. నరేంద్రుని ముఖలావణ్యమును గాంచినను, ఆతని ఱాల్గరగింపగల మృదుమధురగానమును విన్నను రామకృష్ణుడీభౌతిక ప్రపంచమును మరచి ఆత్మసామ్రాజ్యమున నోలలాడుచుండె. రామకృష్ణుని దివ్యసందేశమును వెద

జల్లుటకు సంసారమున అరిషడ్వర్గములను కారడోలగల భీకర
గర్జనల నొనర్చుటకు వివేకానందుడే సమర్థుడని తలంచి తన
అనుభవజ్ఞానమంతటి నాతని పరమొనర్చి తాను విశ్వరంగ
మున జేయవలసిన పని యించుమించుగా బూర్తియైనట్లు భా
వించెను. ఇప్పటికి రామకృష్ణుని దేహారోగ్యము క్షీణించుట
కుపక్రమించె. నిరంతర ప్రసంగములచే గొంతునందొక చిన్న
పుండుపుట్టి క్రమముగ వృద్ధియై వైద్యులకు లొంగక కడకు
శస్త్రచికిత్స యావశ్యక మయ్యెను. అంతడాక్టరు సర్కార్
పనిముట్లతో బ్రవేశించి రామకృష్ణునకావిషయము దెలుప
మత్తుమందావశ్యకము లేకనే యాతడు బాహ్యమును మరచి
సమాధింబ్రవేశించెను. నాడి యాగిపోయెను. డాక్టరునకాశ్చ
ర్యమయ్యె. ఒక్కనిముసమునకు ముందు నామరూపాత్మకజగ
త్తులో మాట్లాడుచున్న రామకృష్ణుడొక్కపరి సమాధిని జేరె
గదా. ఆనందతరంగములపై ఆత్మమండలమున విహరించు
ఆత్మకామునకే దాని మహిమ తెలియగలదు. శస్త్రచికిత్స
ముగిసెను. శిష్యులకు వలయు విషయముల జెప్పి డాక్టరు గృ
హమున కరిగెను

అదివేసవి. మిట్టమధ్యాహ్నమున మార్తాండుడు తన
ప్రచండకిరణములచే భూమిని దహించుచుండెను. నరేంద్రుడు
బజారునుండి మరలివచ్చి యొకదృశ్యమును గాంచెను. ఏమది?
అవతారమూర్తియగు రామకృష్ణుడొక నులకమంచముపై శయ
నించియుండె. చెంత నెవ్వరులేరు. ప్రక్కనగంజిగిన్నె యొకటి
రామకృష్ణుని వ్రణమునుండి పడిన చీము, నెత్తురులతో నిండియుం
డెను. శిష్యులందరు నదియొకయంటు వ్యాధియని భయపడి
పలుత్రోవలపోయిరి. ఆయనయేకాకి, నిస్సహాయుడు. ఆహా!

ఏమి విపరీతము. నిరంతరప్రేమచే దమజ్ఞానాభివృద్ధికై. ప్రి
యాసపడిన గురువరుని కష్టకాలమున విడనాడుటా! ఏసుక్రీ
స్తుయొక్క పరమభక్తులని పూజింపబడు 12 శిష్యులలో శిలు
వకాలమున నెవరుండిరి! ఇదియా గురుశిష్య న్యాయము!
రామకృష్ణుడు ఆరోగ్యముగనున్న కాలమున నందరును జేరిరి.
వ్యాధిగ్రస్థుడు కాగానె యెవర అప్రసన్నులైపోయిరి. వివేకా
నందునకు హృదయము చలించెను. శిష్యుల నందర జేరబిలచి
"ఆహా! ఏమిమీభక్తి! శుష్కవేదాంతమునకా మీరిచటికి జేరి
నది. ప్రేమకృత్యములు చేయవలసిన మీహృదయములు స్మ
శానవాటికలుగా మారినవా. పాశ్చాత్య విజ్ఞానము మీకునేర్పి
నది "అంటు వ్యాధి" యను మాటయా! అది యెచ్చ
టనున్నది? మీహృదయ కార్పణ్యము, నిర్దయత్వము, కారుణ్యరా
హిత్యతయే అంటుజాడ్యము. హైందవ విజ్ఞానము నాకింకొక
యాదర్శము నేర్పినది. అదేదన భక్తివిశ్వాసములు, నిశ్చలత,
నిర్మలత, గలవారి నగ్నిదహింపజాలదు, జలము ముంపజాల
దని. విశ్వాసమే ప్రహ్లాదునకు స్తంభమున నృశింహమూర్తిని
జూపెను! ఆంజనేయుని నీటిపైనడపెను. ఆహా! ఇట్టివిశ్వాసమే
మీకులేదా! మీయంటువ్యాధి భయమునకు నావిశ్వాస
మునకు గల భేదమును జూపెద"నని పలుకుచు చీము నెత్తురు
లతో నిండిన యాగంజిని త్రాగివైచెను. పవిత్రభావముతో
ద్రాగివైచిన నరేంద్రునాయంటు జాడ్యమేమియు జేయజాల
దయ్యెను. ఇట్టి మహత్తర భక్తివిశ్వాసముల కచ్చెరువొం
దియే నివేదితయను నాంగ్లనారీమణి వివేకానందునకు దన సర్వ
స్వమర్పించి శిష్యురాలయ్యెను. ఒకప్పుడు ఉత్తర హిందూస్తా
నమున కలరాజాడ్యము ప్రబలియుండ నీమహాసాధ్వి యచటకేగి

భయంకరమృత్యువునకును వెరువక ఆర్తుల నెందరినో సేవించెను. అట్టి భయంకర దృశ్యములందు అంటుజాడ్యమను భీతి లేక, సాటిసోదర సేవ చేయగలిగిన యామహాతల్లి వివేకానందుని సేవాదర్శముయొక్క మూర్తీభావమే. సాటి భారతీయులు మృత్యువును ధిక్కరించి సేవయందు నిమగ్నులై పరశివుని సాక్షాత్కరింతురుగాక.

రామకృష్ణుని భౌతికదేహము నానాటికి శుష్కించెను. రోగికిని వైద్యమహాశయునకును నడుమ భౌతికమేగాక యాధ్యాత్మిక సంబంధము బలపడుచుండెను. రామకృష్ణుని జూచి డాక్టరుగారొకనాడిట్లనిరి. "To be frank I like you so-much for your devotion to truth. you cannot deviate an inch from what you know to be the truth." దేహము శుష్కించినకొలదిని గురువుగారిదృష్టి శిష్యవర్గముపైనను, వారి యౌన్నత్యము, వారి శ్రేయస్సుపైనను నిలచి వలయుబోధలుగావించుచుండిరి. తనదేహమును బొత్తుగ మరచి శిష్యుల యభివృద్ధికై జగన్మాతను నిరంతరము వేడుచుండెను నరేంద్రునియందుమాత్రము రామకృష్ణుని చిత్తము లగ్నమై యాతనికి తనకడనున్న యాధ్యాత్మిక శక్తి నంతటినొసంగెను. తుదిదినమేతెంచినది. నాడు శిష్యులనందర జేరబిలచి తనవీపునుజూపి యెట్లున్నదని ప్రశ్నించెను. వీపంతయు వ్రణములచే బెట్టినట్లున్నదని వారుబదులిడిరి. దీనికేమి కారణము. శిష్యుల ప్రారబ్ధమంతయు గురువుభరించి, వారికొరకై తన సర్వస్వము ధారాగ్రహీత మొనర్చెను. యేసుక్రీస్తు మానవుల పాపపుంజముకొరకు సాటిసోదరులకొరకు తాను శిలువనెక్కితినని పలుకలేదా! నక్షత్రములనడుమ చంద్రునివోలె వెలింగెడి

నరేంద్రుని రామకృష్ణుడేకాంతముగ జెంతకు బిలచి తండ్రి తన పెద్దకుమారునకు వోలె ప్రేమదృక్కుల వీక్షించి "నలువది వత్సరములుగా నిరంతరకృషిచే సంపాదించిన యాధ్యాత్మిక శక్తియంతటిని నీవర్హుడవుగాన బ్రసాదించుచున్నాను గాన స్వీకరింపుము." అని చెప్పి తన సర్వస్వమాతనికి ధారవోసెను. రామకృష్ణుడు మహాసమాధియందు బ్రవేశించుటకెంత కాలమోలేదు. అప్పటికిని నరేంద్రునకు అనుమానమే. రామకృష్ణుడు తాను రామకృష్ణావతారముల సమ్మేళనయని చెప్పగలిగినచో తన విశ్వాసము దృఢపడునని తనలో దలంచెను. వెంటనే రామకృష్ణుడు ప్రక్కకుపొరలి "ఇంకను సందేహమా! యేమూర్తి రామకృష్ణుల పాత్రల దాల్చెనదో యదియే యిపుడీ రామకృష్ణుడయ్యెనని పలుకుచు మహాసమాధిం బ్రవేశించెను. ఏమి వింత! మానవబుద్ధి కతీతము. ఇంతకాలమునుండి దక్షిణేశ్వరారామమునుండి కోమలకంఠమున వినబడుచున్న మాధురగానము విశ్వగర్భమున విలీనమయ్యెనా! నియమమునకు మించి ఆధ్యాత్మికబోధల నొనరించుచున్న రాజహంస గగనమండలమున కెగసిపోయి యంతర్ధానమయ్యెనా. భక్తుల నానందవార్ధిని దేలించిన దివ్యవాణి నామరూపాత్మకమగు బ్రహ్మాండమును భేదించుకొనిపోయి సత్తామాత్ర స్వరూపిగా నిలచెనా! అవస్థాత్రయమున కతీతమైన మహాసుషుప్తి బ్రవేశించెనా! బ్రహ్మాండమంతటను జ్యోతిస్స్వరూపమున నిండిపోయెనా! హృదయకుహరమున నడగియుండిన నాపరంజ్యోతి విశ్వగర్భునితో నైక్యానుసంధానమును బొందెనా! ఘటాకాశము మహాకాశములో కలసిపోయెనా! అంతయు నిశ్చలము! నిర్మలము! అనిర్వాచ్యము. డాక్టరుగారు నాడిని బరీక్షించి అర

గంటక్రిందనే రామకృష్ణుడు మహాసమాధిచేసెనని వెడలి పోయెను. నరేంద్రుడు నిలువున నీరయ్యెను. "ఎంతటిమూర్ఖుడను. కరుణామూర్తియగు రామకృష్ణునంత తీవ్రముగ పరీక్షించిన నాయవిశ్వాస మేమందును. నాకొరకై దనసర్వస్వమర్పించిన నారామకృష్ణునిట్లు పరీక్షించిన దోషమునకు ప్రాయశ్చిత్తమేమున్నది! కృపాపూర్ణుడై తండ్రివలె బాలించిన నా రామకృష్ణుడేడీ" యని విచారసముద్రమున మునింగిన నరేంద్రుడు కొంతవడికి చెప్పరిలి ధైర్యమును బూని తన గురువుకు దేహసంస్కారమొనర్చెను.

తదుపరి వివేకానందుడు గృహకృత్యముల జక్కబరచుకొని భారమంతటిని రామకృష్ణునిపై బెట్టి చెదరిపోవున శిష్యవర్గమును గూడదీసికొని వారానగరమున నొక బాడుగ యింటిలో వసించి వారి కన్ని విధముల శిక్షణనొసంగుచుండెను. అచట జీవితము చాలకష్టభూయిష్టమయ్యెను. వారందరును భిక్షాటనముచే జీవించుచు వివేకానందుని యుద్బోధవాక్యముల ధైర్యముబూనుచు తమగురువుయొక్క లీలాస్మరణ సలుపుచు ముందు నిర్వహించబోవు ఘనకార్యములకు సిద్ధులగుచుండిరి. కొంతకాలమిట్లు గడపి తాన లేకున్నను తక్కినవారు రామకృష్ణుని యాదర్శము ననుసరింతురను ధైర్యముతో నరేంద్రుడు దేశాటనమునకరిగెను. ఒకపుడు పట్టణములందు దిరుగును. వేరొకపుడు కొండగృహాలలో దపస్సానర్చును. ఉండినచోటనుండక, భుజించినచోట నిద్రింపక శిరముపై నాచ్ఛాదనములేక, కౌపీనమాత్ర పరిధానుడై పరివ్రాజకుడై సంచరించెను. హిమాలయములపై గొంతకాలము తపంబొనర్చి హృదయాంతరాళమున దివ్యజ్యోతిని సందర్శిం

చుచు, భారమంతయు గురువుపై నిడి సంచరించెను. ఒకపుడు నరేంద్రుడు విసికివేసారి తాను ప్రపంచమునుండి చేయవలసిన ఘనకార్యమేమియు గానక జీవితముపై నిస్పృహత జెంది చెంతనే యాకలిచే నకనకలాడుచు బొంచియుండిన వ్యాఘ్రమునకు దనశరీర మాహారముగ నొనర్ప యత్నింప నామాం సాసి ప్రక్కనుండి వెడలిపోయెనేగాని భుజింపదయ్యెను. భగవానునిసంకల్ప మెవరు తెలుసుకొనగలరు. విశ్వరంగమున రామకృష్ణుని సందేశమును బోధింపవలసిన నరేంద్రుని ఘోరవ్యాఘ్రి మెట్లుచంపగలదు. ప్రపంచమున దాను నిర్వహింపగల కర్తవ్యమేదోయున్నదను విశ్వాసము బలీయము గా మరల బట్టణముల బ్రవేశించి మహాత్ముల సందర్శించుచు, గాయకష్టములకోర్చి పర్యటనములలో నూతనానుభవము గడించి ఉత్తర హిందూస్థానమును బ్రవేశించెను.

రాజపుటానాలో బ్రయాణమొనర్చుచుండ రైలులో నొక చిత్రము జరిగినది. నరేంద్రుని చెంతనపుడొక తడిపవస్త్రమును గమండలువు మాత్రమేయుండెను. టికెట్టునొక ధనికుడు కొనియిచ్చెను. రైలులో నరేంద్రుని చెంతనొక ధనికుడు తన భోగసామగ్రినంతయు జుట్టునిడుకొని దానిని జూచుచుగర్వించి కౌపీనమాత్రపరిధానుడై యున్న నరేంద్రుని జూచి "దేహమును బెంచుకొని సోమరివలె ఏలతిరుగెదవు. ధనమార్జించి ఏలసుఖింపవు" అని మందహాసముతో పరిహసించుచుండెను. కాని నరేంద్రుడేమియు మారుపలుకక ధ్యాననిమగ్నుడై యాతని మాటల బాటిసేయనట్లుండెను. రైలు గమ్యస్థానమును జేరెను. ఇద్దరు నొకచిన్న స్టేషనులో దిగిరి. ధనికుడు మొదటి తరగతిప్రయాణీకుల బసలోవిడిసి హాయిగా

బరుండెను. వివేకానందుడో తరణి కిరణములచే మల మల మాడుచున్న యిసుకలో నొక కర్జూరపు చెట్టుక్రింద తన తడివస్త్రమును బరుచుకొని యాసీనుడై యాకటిచేగృశించుచు, దాహమున కాగలేక గమండలూదకమును ద్రావుచుండెను. ఇచ్చటగూడ నరేంద్రునకు ధనికుని పోటుమాట..దప్పవయ్యె. భౌతిక సంపద ఆధ్యాత్మిక సామ్రాజ్యము నెట్లు తెలిసికొన గలదు. భోగలాలసుడు మహాత్యాగి నెట్లు గుర్తింపగలడు. అజ్ఞానముచే నావరింపబడి ఆశాపిశాచము తలకెక్క, మదోన్మత్తుడై విశ్వరంగమున భగవల్లీలలు గాంచజాలని పామరుడు జ్ఞానదీక్ష నెట్లు అర్థముచేసుకొన గలడు. విషయవాసనచే హృదయమున భక్తిబీజము నశించభక్తాగ్రేసరు నెట్లు నమస్కరింపగలడు? మన సన్న్యాసి యాచెట్టునీడను దలదాచుకొనిన నాధనికునకేమి పట్టినది.

కొంతతడవిట్లు గడచినది. ఆపగరమున నొక మిఠాయి వర్తకుడు నిత్యము నింటికడ మిఠాయిలను జేసుకొని స్టేషనులో నమ్ముచుండును. నాడుగూడ సరకంతయు నింటికడ సిద్ధపరచుకొని యెండతీవ్రముగ నుంట నించుక శయనించెను. వెంటనే శ్రీరామచంద్రుడాతని స్వప్నములో "నాభక్తుడొకడు స్టేషనులో ఆహారములేకున్నాడు. వెంటనే లేచి వానికాహార పానీయములొసంగుము"ని వీపుపై జరచి ఆజ్ఞాపింప, వలయు వస్తువుల నాతడు గైకొని స్టేషనుకుబోయి వివేకానందుని జూచి "లెండుబాబాజీ! పాదప్రక్షాళనమొనర్చుకొని యీమిఠాయిని గ్రహింపుడని" ప్రార్థించెను. వివేకానందునకాశ్చర్యమై నాకాసంగతి యేమియు దెలియదు. మరెవరికైన బంపబడినవి పొరపాటున నాకొసంగదలచితివేమోనని మారుపలి

కినను వర్తకుడు విడువక "కాదు బాబాజీ! రామచంద్రుడు వర్ణించి చూపినవారు మీరే. లెండు భుజింపుడని" నిర్బంధించెను. వివేకానందుడంత భగవన్మహిమను గొనియాడుచు లేచి భుజించెను. భక్తులయందు భగవానుని కెంతప్రీతి!

ఈదృశ్యమంతయు జూచుచుండిన ధనికునకు గర్వభంగమై కనులుదుడుచుకొని వివేకానందుని చెంతజేరి తన యజ్ఞానమునకు క్షమాపణవేడుకొన స్వామి యాతని కౌగలించి ప్రేమజూపెను. ఆహా భక్తులకు క్రోధము దూరముగదా! ఈ యదార్థ విషయమువలన మనము నేర్చుకొనవలసిన సంగతే మన భౌతిక సంపదచే విఱ్ఱవీగి భగవానుని మరచినవారికి గలుగు పరాభవము, కష్టములకోర్చి భగవానుని నమ్మిన భక్తునకు లభించు గౌరవము. చీకటివెలుగులకువలె ఐహికాముష్మికములకు సంపర్కము [illegible]. మానవప్రవిజ్ఞానము, సహనము కష్టకాలమందే తెలియునుగాని కడుపునిండిన వెనుక పలికెడి శుష్కవాక్యములచేత కాదు. ధీరుడై, వీరాగ్రేసరుడై, విశ్వరంగమున ఖడ్గమృగమువలె నిరాఘాటముగ సంచరించిన వివేకానందుడు తన జ్ఞానానుభవమునకు దేశాటన వన్నె దెచ్చుచుండ ఉత్తర హిందూస్థానమునువీడి ఖేత్రిమహారాజునకు బుత్రసంతాన భాగ్యమును గలుగజేసి పూనాపట్టణమున బాలగంగాధరతిలక్ మహాశయుల సందర్శించి చెన్నరాష్ట్రముగుండ కన్యాకుమారిని జేరెను.

ఈకన్యాకుమారి హిందూదేశమునకు దక్షిణపుచివర. ఇచ్చట సముద్రమునందు వడ్డునకు గొంత దూరములో గన్యాకుమారి యాలయముకలదు. ఈయాలయమ్మును సందర్శింప గుతూహలుడైన వివేకానందుని చెంత డబ్బులేక నీటిలో

యాదుకొనిపోయి గట్టుజేరి కొంతకాలము ధ్యాననిమగ్నుడై యుండెను. కృతయుగమునుండి నేటివరకు భారతవర్షము బొందిన మార్పులన్నియు నొక్కపరియాయన మానసిక ఫలకమున గనుపట్టెను. ప్రస్తుత భారతీయదైన్యమునకు జాల విచారపడెను. భారతీయులు తమ పూర్వ సౌభాగ్యమును గోల్పోయి కుక్షింభరులై మతమునంతయు స్వార్థమున కుపయోగించుకొని సంఘమును తారు మారు చేసి జనులలో విభేదముల గల్పించిన పురోహితమండలి యజ్ఞానమునకై వగచెను. ఐకమత్యమునకు ముఖ్యసాధనమగు మత మీనాడు దురహంకార భూయిష్టమై సోదరులనడుమ కలతలను బెంచుచున్నందులకు జింతించెను. భీష్మాచార్యునివంటి విజ్ఞానుని, అభిమన్యునివంటి పరాక్రమశాలిని బ్రసవించిన భారతమాత, శివాజీ, రాణా ప్రతాపుడు, మొదలగు వీరులను, గార్గి, మైత్రేయి, అరుంధతి మొదలగు విదుషీమణులను, పద్మిని, అహల్యాబాయి, రాణీఝాన్సీ మొదలగు వీరవనితలను బ్రసవించిన భారత మాత నాటిస్థితియేమి! తినుటకు తిండిలేక, పండుటకు బంచలేక, నిలుచుటకు నీడలేక కృశించు నేటిస్థితియేమి! రత్నాలంకార శోభితమై కలకలలాడు నాటి భారత వర్షమేడ! స్మశాన తుల్యముగనున్న నేటి భారత వర్షమేడ! ఎంతటి వ్యత్యాసము! సంపదనంతయు గోల్పోయినను, సజీవముగ మాత్రమున్నది! ఇదియొకమేలే! ఇట్లున్న భారత మాతను మరల ఉద్ధరించుటెట్లు ఇట్టిభావములచే జిత్తముక్షోభింప, దిగంబర మహాదేవులవలె దిరుగుచున్న దరిద్రనారాయణుల జూచిన దుఃఖము పొరలుచుండ గర్తవ్యమేమని యోచించెను. "ధనము, పనిజేయు మనుష్యులున్నచో దేశము మరల నుద్ధరింపబడును. గ్రామ

ములవెంట దిరిగిన మనుష్యులు దొరకుదురేమోగాని ధన మెవ్వరిత్తురు. ఆసేతుహిమాలయ పర్యంత పర్యటనములో ధనికులవలన నేమియు సాయముచేకూరదని తెలిసిపోయెను. పాశ్చాత్యదేశములందు ధనమిపుడు పుష్కలముగ నున్నది. అచ్చటికిఁబోయినచో ధనముదొరకును. భారతీయవిజ్ఞానమున కిపుడు పశ్చిమదేశము లెదురుచూచుచున్నవి. అద్వైతం [illegible] దేశవిమోచనకు బ్రయత్నింతును. ఆపనికే నాజీవితము లర్పింతునని సంకల్పించుకొని నూతనోత్తేజముతో నచటినుండి బయలుదేరి చెన్నపురిని జేరెను. అది 1893 సంవత్సరము.

వివేకానందుని భాషణములను విని చెన్నపురిలో గొందరు పాశ్చాత్యవిజ్ఞానులిది కాగలపనికాదని యాక్షేపించిరికాని, పట్టపరీక్షకు జనువు విద్యార్థులు కొందరు వివేకుని విజ్ఞానమునకు, ఆతని భక్తివైరాగ్యములకు, మృదుమధుర సంభాషణలకు వశులై యచట ప్రధాన న్యాయాధీశుడుగానున్న సుబ్రహ్మణ్యఅయ్యరుగారితో సంప్రదించి ఆసంవత్సరమున నమెరికా దేశములో చికాగోనగరమున జరుగుచున్న ప్రపంచ మతమహాసమ్మేళనమున హిందూమతమును బ్రచారమొనర్ప బ్రతినిధిగా నెన్నుకొని పంపదలచి కొంతద్రవ్యమును సమకూర్చిరి. చికాగోనగరమునకుఁబోవుటకు వ్యవధియున్నందున వివేకానందుడు హైదరాబాదునకుఁబోయి యచ్చటనుండి ఖేత్రిమహారాజు తనకు నూతనముగా జన్మించిన పుత్రుని యుత్సవమునకాహ్వానింప నచటికేగెను. మహారాజచట స్వాములవారి నుచితరీతి సత్కరించివారి యమెరికా ప్రయాణమునకు వలయు దుస్తులు ధనమును బహూకరించిరి. వివేకానందుడు తన ప్రయాణమునకై నిరీక్షించుచుండెను. తన గురుదేవుని యాజ్ఞకై యెదురు

చూచెను. అంతనొక నాటి రాత్రి స్వప్నములో రామకృష్ణుడు కాన్పించి సముద్రముపై బరుగిడుచు వివేకానందుని దన వెంటరమ్మని యాజ్ఞాపించెను. స్వప్నదృశ్యమునకు సంతసించి ఖేత్రి మహారాజును వీడ్కొని బొంబాయి జేరి స్టీమరునెక్కెను.

స్టీమరుపోవుచున్నది. ఆతరంగడోలికలను భేదించుకొని వీరావేశముతో ముందునకు బోవు నాస్టీమరులో దన వాక్ప్రవాహముచే పాశ్చాత్యచిత్తములనుఱ్ఱూతలూగించవలసిన పురుషాగ్రేసరుడందాసీనుడై మానసవీధిలో నూతన భావములను, నూతన పరిభ్రమణముల బొందుచున్నాడు. ఆతడే వివేకానందుడు.

స్టీమరు గమ్యస్థానమును జేరినది. వివేకానందుడు చికాగోనగరమును జేరి మతసభకు జేయబడిన యేర్పాటుల జూచి సంతసించెను. అచ్చట నొక హోటలులో బసచేసి పాశ్చాత్యుల యుత్సాహము, శక్తి, యువకావేశము మొదలగు గుణములజూచి హిందూదేశము నుద్ధరించవలెనను ఆశ గాఢమగుటచే నదియెట్లు నెరవేరునాయని యాలోచనాతత్పరుడై కాలముగడపుచుండెను. ఇంతలో దన వద్దనున్న ధనమంతయు వ్రయముగా, చేయునదేదియు దోచక బోస్టను నగరమునకు బయలుదేరెను. మార్గమున రైలులో నొక నారీమణి వివేకానందునింగాంచి యాతని సంభాషణలకు, వేషమున కచ్చెరువంది తన యింటికిగొనిపోయెను. అచ్చట నగరమునగల ప్రముఖుల పండితుల సమావేశపరచి వివేకానందునితో బ్రసంగింపజేసె. వారందరాయన యద్భుత విద్యకు, విజ్ఞానమునకు మెచ్చిరి. వారిలో నొక ప్రముఖుని వలన బరిచయలేఖనుగైకొని మరల చికాగోనగరమున కేతెంచునప్ప

టికి దేహమంతయు డస్సిపోయెను. రాత్రి కాలమగుటచే నచట నొక రైలుపెట్టె క్రింద దిగజారి యర్ధసమాధిలో నుండెను. అంతలో దూర్పుదిక్కున నరుణోదయమై క్రమముగ బొద్దెక్కెను. ఆకలిబాధ దహించుచుండ చేయునదేమియు లేక భిక్షాపాత్రను గైకొని యచటి పాశ్చాత్యగృహములకు జనెను. భిక్షమెత్తుటనిన పాశ్చాత్యులలో హాస్యాస్పదము. నేరముకూడ. అచట నాతని కేమియు లభింపకపోగా దూషణములకు బాలయ్యెను. ఇట్లాకలిచే బీడింపబడిన వివేకానందుడు కడకొక బాటప్రక్కన మూర్ఛిల్ల చెంతనేయొక భవనముననున్న యొక సతీతిలక మదిగాంచి యాతని చెంతజేరి సేదదీర్చి హిందూమత ప్రతినిధిగా నాతని నెఱింగి తన గృహమునకు గొంపోయెను అంతమరుసటి దినమున మత సభ కధ్యక్షుడైన డాక్టర్ బారోస్‌ను సందర్శించెను. మరుసటి దినమే మహాసభాప్రారంభము. ఏమిదైవ సంఘటన! ఎన్నికష్టపరంపరలకు గురియైనను భగవానుని యిచ్ఛనెరవేరకుండునా! సువర్ణ మగ్నిత ప్తమైన కొలదిని తన చాయలవెలి గ్రక్కునగదా! అట్లు వివేకానందుడు కష్టములనెల్ల దాటి సంపూర్ణ ధైర్యసాహసములతో, యువకావేశముతో, అనుభవజ్ఞానముతో హిందూమతము తరపున మతమహాసభ నలంకరించెను.

1893 సం॥ ఆగష్టునెలలో మహాసభ ప్రారంభమైనది. అన్నిదేశములనుండి, యన్నిమతములనుండి ప్రతినిధులు వచ్చియుండిరి. భవనమంతయు జిత్రాలంకారశోభితమై భూతల స్వర్గమువలె నుండెను. సర్వమత, సర్వవిద్యాతత్వవేత్తలగు నాతెల్లవారు భూలోక గంధర్వులోయన నాసభ నలంకరించిరి. ఇట్టి సభలో మన వివేకానందునకు 33 వ స్థానము నియమితమయ్యెను. సభాప్రారంభసూచకమగు హర్షధ్వనులు చెలరేగి

నవి. సభాధ్యక్షుఁడు తనప్రారంభోపన్యాసమును బూర్తిజేసెను. దాదాపు వెయ్యి ఉపన్యాసములు చదువబడెను. మొదటి దినము వివేకానందుఁడుపన్యసింపలేదు. ఆసభను జూచినంతనే వివేకానందునకు ధైర్యమునన్నగిల్లెను. అభౌతికలావణ్యమాతని యాధ్యాత్మిక భావములను గప్పివైచెను. రెండవదినమున గూడ నాతఁడుపన్యసింపలేదు. ఆతని గుండెచెదరినది. మూఁడవ రోజున భౌతికవిజ్ఞానసభాధ్యక్షుఁడగు Dr. Snell గారు వివేకానందుని ఉపన్యసించుమని కోరినకాలదిని యాతనికి యధైర్యమెక్కువై, శరీరము చెమ్మగిల్లి, నోటమాట రాదయ్యెను. తాను హిందూదేశము నుద్ధరింపగలనను యహంకారమడంగెను. పాశ్చాత్య ప్రపంచమంతయును దలక్రిందులు చేయుదునని యింతదూరమేతెంచి సమయమునకు దనదేశమునకును మతమునకు నవమానము జేకూర్చుటా! యను భావములు దోప నిస్సహాయుఁడై, మనోగర్వముఁ వీడి తనగురువును, సరస్వతీదేవిని స్తోత్రముచేసి నిలువబడి సభ్యులను "సోదర సోదరీమణులారా!" యని సంబోధించినంతనే సభ్యులనుండి హర్షధ్వనులు చెలరేగి నింగినిముట్టెను. సభికులు పరవశులైరి. దొరసానులందరు నుత్సాహముబట్టజాలక లేచి జేబురుమాలలెగురవైచిరి. కొందరు మోకాళ్ళపైనిలదిచి నమస్కృతులొనరించిరి. కొంతకాలము వివేకానందుడు మాట్లాడుటకే వీలు కలుగదయ్యె. సద్దడగగానే స్వాములవారు స్వల్పోపన్యాసమునుజేసిరి. దానిని సువర్ణాక్షరములచే హృదయఫలకముల లిఖింపందగు. ఆసభావేదికపై నిలచిన ధీరునిస్వరూప మొకింత దిలకింపుఁడు. ఆర్యసంతతికి యాదర్శమూర్తి యచట నిలువబడి వేదాంతగర్జన చేయుచున్నది! ఆజానుబాహువులు, విశాలఫాలము, పుండరీకములబోలు లోచనములు! కషాయకాం

తుల వెలిగ్రక్కు శిరోవేష్టనమునుండి తొంగిచూచు ముంగురులు! ఆపాదమస్తకము వ్రేలాడు కాషాయబురఖాపై నడుముకడ గట్టబడి ధీరలక్షణమును సూచించు కాశీకోశ! ఇది త్యాగశౌర్యముల సమ్మేళన స్వరూపము! ఆమూర్తినోటి నుండి యగ్నిస్ఫులింగములవోలె సంతత ధారగా వెలువడుచున్న వాక్ప్రవాహముచే సభ మంత్రముగ్ధుల వోలెకట్టువడియెను. బాహ్యప్రపంచమును మరచి యానంద తరంగముల దేలియాడినది. ఆనాటి స్వల్పోపన్యాసమే యమెరికాదేశమును మేల్కొల్పినది. సభపూర్తియై బయటికే తెంచిచూడ నెచటవినినను వివేకానందుని ప్రశంసయే ఎచటికి బోయినను ఆహ్వానములే! వీధులలో నెచటజూచినను వివేకానందుని చిత్రములే! క్రిందటిదినమున నాకలిబాధచే బాటప్రక్కన సోలిపడి సేదదీర్చెడివారు లేని యనాథుడగు వివేకానందుడే నా యీతడు! దైవలీల నెన్న నెవరితరము!

వివేకానందున కంతటినిస్పృహ యేలకలిగినది ? జయ మెట్లు చేకూరెనను విషయ మొకింత విచారింతము. స్వాములవారు తనవిజ్ఞానముపారమని కు, గట్టమగుఉపన్యాసకుడననియు గర్వించి, లెక్కిన మతప్రతినిధులందరు ఉపన్యాసముల వ్రాసుకొనివచ్చి చదివియుండ, యూరకనే సభకు వెడలెను. ఈ యహంకారముచే హృదయదౌర్బల్యము కలిగెను. తుదకు దన యవ్యక్తతను గ్రహించి "అహంయంత్రం, భవాన్ యంత్రీ!" యని దేవిని స్తుతింపగానే గంగాప్రవాహమురీతి ఉపన్యాసము దొరలెను. సభకట్టువడియెను. ఆమాట్లాడినది వివేకానందుడుగాదు. ఆయనద్వారా విశ్వనియంత యుపన్యసించెను. అట్లే మనమందరము చిత్తముల భగవానునికర్పించి అహంకారమునువీడి విశ్వరంగమున విశ్వహృదయమున లీనమై

నప్పుడు జగన్నియంతలీలలు విశ్వలీలలై విశ్వోద్ధరణ కావింపగలవు. స్వాములవారు ఆమెరికావారి స్వాగతమునకు బ్రత్యుత్తరమొసంగుచు దనకృతజ్ఞతను దెలుపుచు మూడువాక్యముల బలికెను. "అనాదిసిద్ధమైన సన్యాసాశ్రమముల తరఫున నా కృతజ్ఞతాభివందనములు. మతములకు దల్లియైన హిందూమతముతరఫున ధన్యవాదము! హిందూప్రజలతరఫున నాశీర్వాదములు." పై మొదటివాక్యము స్వామికి సన్యాసాశ్రమమునందుగల గౌరవమును సూచించును. ఈనాటిసన్యాసులు అలసులై, కాషాయమాత్రపరిధానులై దేశమున కావంతయు దోడ్పడక నానాటికి భారమగుచున్నారు. భారతవర్షము పునరుద్ధరింపబడవలెనన్న నట్టిసన్యాసులు భావనిద్రనుండి మేల్కానవలె. సన్యాసాశ్రమమును బునరుద్ధరించిన శంకరుడు ఆసేతుహిమాచలము పర్యటనసలిపి, క్షణమైన విశ్రమింపక చేసిన సేవ ఈనాటి సన్యాసులకు దూరమైనది. శంకరులభాష్యశాంతితో భావశాంతిగూడ చేసికొని వివేకానందునివలె దమజీవితములను విజ్ఞానాగ్నిచే బునీతమొనర్చికొని దేశవిమోచనకు దోడ్పడుదురుగాక. విశ్వోద్ధరణకై ప్రాణముల నర్పించి విశ్వమహాయజ్ఞమున కాహుతులయ్యెదరుగాక. వివేకానందుని సేవస్మరించి సేవలో శివుని సాక్షాత్కరించెదరుగాక.

విశ్వమున కాసియాఖండము తల్లివంటిది. ఇచ్చటనే మతోద్ధారకులందరు జన్మించిరి. హిందూదేశమాసియాఖండమునకు గుండెవంటిది. హృదయము సరిగ బనిచేయునంత కాలము శరీరమున కెట్టి భయమునులేదు. భారతీయులందరి తరఫున నభివందనముల దెలుపుటలో స్వాములవారీనాడు మనల బాధించు స్వల్పభేదముల దాటి భారతజాతిని ఏకస్వరూపముగా దిలకించెను.

ఇతర మతములయెడ హిందూమతమున కసహనము లేదు. ఏమతస్థుడైనను భారతవర్షమున నుండవచ్చును. మతములన్నియు భగవంతునిజేరు మార్గములే. కాన నెవరును దమ మతమును ద్యజించి యన్యమతావలంబి కానక్కరలేదు. మన మందరమూ సత్యస్వరూపివైపునకే నడచుచున్నాము. మార్గములుమాత్రము పరిస్థితుల ననుసరించి భిన్నములు. ఏ ఘంటానినాదమూనాడు మ్రోగినదో యదియే యసహనములకు, దౌర్జన్యములకు, మృత్యుసూచకమగుగాక యని స్వాములవారాశీర్వదించిరి.

మరునటిదినమాసభలో స్వాములవారొక గంభీరమును, విశ్వమానవోద్ధరణ దక్షమునగు ప్రసంగమొకటి సలిపిరి. ఆమహామతసభలో స్వామికి నూతనవిజయముచేకూరెను. పత్రికలేమి, విఖ్యాతపండితులేమి, స్వామిని మానవోద్ధారకుడని ఘోషించెను. మతములకు బుట్టినిల్లగు భారతవర్షమునకు మతబోధకులనంపుట యవివేకమని పాశ్చాత్యమతసంఘములు గ్రహింపగలిగెను. తదుపరి స్వాములవారు అమెరికాదేశమునంతటను బర్యటనముసలిపి మతోపన్యాసములనొసంగి భారతభూమికిని, హిందూమతమునకును విజయమును జేకూర్చెను. పిమ్మట వారు ఇంగ్లాండుదేశమున కాహ్వానింపబడి యచట గొంతకాలముపన్యసించి సోదరినివేదితయను నాంగ్లనారీమణిని గుడ్విన్ అను యువకుని వెంటదీసికొని భారతవర్షమునకు బయలుదేరి వచ్చిరి.

1893 వ వత్సరమున బ్రారంభమైన వివేకానందుని విజ్ఞాన బోధలు విశ్వమున నలుమూలల వ్యాపించెను. ఫ్రాన్సుదేశమున నొక మతసభగూడి యచ్చట కాహ్వానింపబడి వారి ఫ్రెంచిభాషలోనే ఉపన్యాసముల నొసంగి యచ్చెరు

పొందించెను. నేటికిని ఇంగ్లీషువారు స్వాములవారి యుపన్యాసములను భావములకొరకు గాకున్నను భాషకొరకైన జదువుచున్నారన వాని ప్రశస్తిని జాటుచున్నది. ఋగ్వేదమును శాయన భాష్యముతో నింగ్లీషులోని కనువదించిన మాక్సుముల్లర్ పండితుని, జర్మనీదేశములో ఉపనిషత్తులపై కృషి చేసి యనేక వేదాంతగ్రంథముల రచించిన డ్యూసేన్ పండితుని గలసికొని వారితో ననేకవిషయములనుగూర్చి ప్రసంగించెను.

1902వ వత్సరము వచ్చుసరికి విశ్వరంగమున వివేకానందుని పని చాల పూర్తియయ్యెను. స్వాములవారు ఉబ్బస వ్యాధిచే గొంతకాలమట్టి ప్రచారమును జేయలేకపోయిరి. అంత్యముసమీపించెను. ముందుగనే స్వాములవారు రాబోవు తన సమాధిని సూచించువాక్యములు పలుకుచుండెను. జులై 4వ తేదీన అరుణోదయమైనది. ఆనాడే స్వామి మహాసమాధిలో జేరదలచెను. ఉదయమంతయును ధ్యానమగ్నుడై యుండెను. మధ్యాహ్నము సోదర సన్యాసులతో నానందముగ భుజించెను. సాయంకాలము శిష్యులకు లఘుకౌముదిని పాఠముజెప్పెను. పిమ్మట కొంతదూరము విహారమునకరగివచ్చి స్నానమాచరించి శ్రీరామకృష్ణుని ప్రతిమగల నొకగదిలో ప్రవేశించి కొంతకాలము ధ్యాననిమగ్నుడై యుండి తన శిష్యునొకని జెంతకుబిలచి మూర్ధ్నమున విసరుమనియె. కొంతకాలమైన పిమ్మట శిష్యునావలకుబంపి తలుపుగడియవైచుకొని రుద్రాక్షమాలంజేబూని యర్ధనిమీలితనేత్రుడై పరశివునిధ్యానించుచు సత్తామాత్ర సత్యస్వరూపమునందు లీనమయ్యెను. అష్టాంగ యోగముచే సమాధింజేరి బ్రహ్మరంధ్రముభేదించి హంసను విశ్వాత్మయందు లీనమొనర్చె. అదియే మహాసమాధి. పిదప

యాశ్రమవాసులచే స్వాములవారి దేహము మహావైభవముతో గాషాయాలంకృతమై చందనదారువులతో దహింపబడి పిదప యస్థిసంచయనమొనర్చి యొక సువర్ణపాత్రలో జాగ్రత్తగానుంచబడి నేటికిని బూజలనొందుచున్నది.

వివేకానందుని ప్రతిభ యాయన యస్ఖలిత బ్రహ్మచర్యమునందే కలదు. ఈబ్రహ్మచర్యవ్రతమహిమ అద్భుతము. ఇది యే మానవుని ఉత్తమగతులను బొందించును. ఈ బ్రహ్మచర్య శక్తిచేతనే స్వాములవారు తపోనిష్ఠాగరిష్ఠుడై, భగవధ్ధ్యానమున నిశ్చలచిత్తుడై, నిర్మ్మలితకర్ముడైన మునిముఖ్యునివలె శోభిల్లువాడు. ఆయన భక్తియు నిరుపమానము. మృదుమధురగానముతో దంబుర గైకొని జగజ్జననిగూర్చి రామప్రసాదుని కీర్తనల బాడుచున్నపుడు రామకృష్ణుడు మైమరచి యానందనృత్యము సలిపెడివాడు! సమాధిలో బ్రవేశించువాడు. పదునుకత్తిపై నడకవంటి జ్ఞానమార్గమా యాతనికి రాచబాటయే.

సుఖదుఃఖములను ద్వంద్వముల కతీతుడై స్థితప్రజ్ఞునివలె శోభిల్లువాడు. వివేకానందుని జీవితమంతయు నొక గుణపారమే. అష్టాంగయోగముచే సమాధి చేరకలిగినవాడే వివేకానందుడు. జీవబ్రహ్మైక్యానుసంధానమొనర్చి జీవితమును తేజమొనర్చుకొని జ్ఞానాగ్నిచే అరిషడ్వర్గము బరిమార్చి భక్తాగ్రేసరుడై నిరంతరము భగవత్సేవ, మానవసేవ, మాతృభూమిసేవ, యొనర్పగలిగినవాడే వివేకానందుడు. జ్ఞానులలో జ్ఞాని, భక్తులలో భక్తుడు, యోగులలో యోగిపుంగవుడు. జ్ఞాన, భక్తి, కర్మ, యోగముల సమ్మేళనమే వివేకానందుని జీవితము. అందుచే వివేకానందుడు పూర్ణయోగియని నావిశ్వాసము. శుకమహర్షివలె, ఒకప్పుడీతడు పాశ్చాత్యదేశముల

# వివేకచంద్రికలు ★ వివేకచంద్రికలు

శ్రీమత్ స్వామి వివేకానంద, అభేదానంద, శ్రీరామతీర్థస్వామి, శ్రీఅరవిందయోగి, మహాత్మాగాంధి మొదలగు వారు భారతవర్షోద్ధారకులు. భారతవిజ్ఞాన నిర్మాతలు. వారి భగవద్విశ్వాసము, ఆత్మశక్తి, కార్యదీక్ష మొదలగునవి అపారము. పైమహనీయుల యుత్తమ గ్రంథములు 12, వివేకచంద్రికలను పేర ప్రచురించియున్నాము.

| పుస్తకముల పేర్లు. | గ్రంథకర్తలు. | ఖరీదు. |
|---|---|---|
| 1. భక్తలక్షణములు | శ్రీవసుమహరనాథ రాయారు | 0-2-0 |
| 2. ప్రబుద్ధభారతము | శ్రీమత్ వివేకానందస్వామి | 0-2-0 |
| 3. విశ్వమతదర్పణము | ,, ,, | 0-2-0 |
| 4. గృహస్థాశ్రమతత్వము | శ్రీరామతీర్థస్వామి | 0-2-0 |
| 5. దుఃఖనివారణోపాయము | ,, ,, | 0-2-0 |
| 6. కర్మతత్వము | శ్రీమత్ అభేదానందస్వామి | 0-2-0 |
| 7. శ్రీరామకృష్ణ-వివేకానందులు | యం.వి.యల్. నరసింహారావుగారు | 0-2-0 |
| 8. భగవద్వినోదములు | | 0-2-0 |
| 9. సర్వమతసామరస్యము | | 0-2-0 |
| 10. యోగసాధన | శ్రీఅరవిందయోగి | 0-2-0 |
| 11. భగవద్గీతామృతము | శ్రీశర్మగారు | 0-2-0 |
| 12. ఇంద్రియ నిగ్రహత్వము | మహాత్మాగాంధి | 0-2-0 |

ఈ పండ్రెండు పుస్తకములు 800 పేజీలుండును. ఒకే పర్యాయము మీ పండ్రెండు పుస్తకములున్ను కొనువారికివి, రు 1-2-0 కే, లభించును. పోస్టుఖర్చులు ప్రత్యేకము. పుస్తకములు దొరకు చోటు:— శ్రీరామకృష్ణ పూజామందిరము,

కొత్తపేట, గుంటూరు.

# వివేకచంద్రికలు ★ వివేకచంద్రికలు

శ్రీమత్ స్వామి వివేకానంద, అభేదానంద, శ్రీరామ తీర్థస్వామి, శ్రీఅరవిందయోగి, మహాత్మాగాంధి మొదలగు వారు భారతవర్షోద్ధారకులు. భారతవిజ్ఞాన నిర్మాతలు. వారి భగవద్విశ్వాసము, ఆత్మశక్తి, కార్యదీక్ష మొదలగునవి అపారము. పైమహనీయుల యుత్తమ గ్రంథములు 12, వివేకచంద్రికలను పేర ప్రచురించియున్నాము.

| పుస్తకముల పేర్లు. | గ్రంథకర్తలు. | ఖరీదు. |
| --- | --- | --- |
| 1. భక్తలక్షణములు | శ్రీకుసుమహరనాథ ఠాకూరు | 0-2-0 |
| 2. ప్రబుద్ధభారతము | శ్రీమత్ వివేకానందస్వామి | 0-2-0 |
| 3. విశ్వమతదర్పణము | ,, ,, | 0-2-0 |
| 4. గృహస్థాశ్రమతత్వము | శ్రీరామతీర్థస్వామి | 0-2-0 |
| 5. దుఃఖనివారణోపాయము | ,, ,, | 0-2-0 |
| 6. కర్మతత్వము | శ్రీమత్ అభేదానందస్వామి | 0-2-0 |
| 7. శ్రీరామకృష్ణ-వివేకానందులు | యం.వి.యల్. నరసింహారావుగారు | 0-2-0 |
| 8. భగవద్వినోదములు | | 0-2-0 |
| 9. సర్వమతసామరస్యము | | 0-2-0 |
| 10. యోగసాధన | శ్రీఅరవిందయోగి | 0-2-0 |
| 11. భగవద్గీతామృతము | శ్రీశర్మగారు | 0-2-0 |
| 12. ఇంద్రియ నిగ్రహతత్వము | మహాత్మాగాంధి | 0-2-0 |

ఈ పండ్రెండు పుస్తకములు 800 పేజీలుండును. ఒకే పర్యాయము మీా పండ్రెడు పుస్తకములున్ను కొనువారికివి, రు 1-2-0 కే, లభించును. పోష్టుఖర్చులు ప్రత్యేకము. పుస్తకములు దొరకు చోటు:— శ్రీరామకృష్ణ పూజామందిరము,

కొత్తపేట, గుంటూరు.

# భక్తిప్రబోధిని.

## (48 పేజీల మాసపత్రిక. సం॥ చందా 1-0-0)

భగవదవతారములగు (1) శ్రీకృష్ణచైతన్య ప్రభువు, (2) భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస (3) శ్రీవివేకానందస్వామి, (4) శ్రీకుసుమ హరనాథ ఠాకూరు, మొదలగువారి దివ్యజీవితములను, యుపదేశములను భక్తిప్రబోధిని మాసపత్రిక యందు వరుసగా 1932 సం॥ అక్టోబరు నెల నుండి ప్రచురించుచున్నాము. ప్రతి నెలను 48 పేజీలుండును. ప్రతి నెల 10 తేదీన వెలువడును. ఇది ఆంధ్రసోదర సోదరీమణుల కందరికి అందుబాటులో నుండగలందులకై, ఒక సం॥ చందా, పోస్టేజితో రు 1-0-0 మాత్రము యేర్పాటు చేసియున్నాము.

1. శ్రీకృష్ణనామ సంకీర్తనముచే, ఆసేతుహిమాచల పర్యంతము, దేశమును పవిత్రము చేసిన, శ్రీకృష్ణచైతన్య మహాప్రభువువారి చరిత్రము, యుపదేశములున్ను, భగవన్మహిమా విశేషములున్ను,
2. తనమురళీగానమాధుర్యముచే, శ్రీకృష్ణనామమును లోకమునకు చాటి జన్మించిన 20 శతాబ్దపు యుగపురుషుడగు, శ్రీకుసుమహరనాథ ఠాకూరు వారి చరిత్రమును యుపదేశములు, భగవన్నామ మహిమాతత్వమున్ను,
3. భక్తులలో నుత్తమభక్తుడును, యోగులలో మహాయోగియు, జ్ఞానులలో మహాజ్ఞానియును, శ్రీరామ శ్రీకృష్ణుల యొక్క సమ్మేళనావతారమైన భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంసవారి చరిత్రమును యుపదేశములున్ను,
4. తన వేదాంతగర్జనలచే, ఖండఖండాంతరములందు హైందవమత భగవద్ధర్మమును ప్రజ్వలింపజేసిన శ్రీమత్ వివేకానందస్వామివారి చరిత్రమును, యుపదేశములున్ను, ఆధ్యాత్మిక ధర్మమహాశాస్త్రములున్ను,

పఠించి అందలి విషయములను తెలిసికొనగోరువారందరును భక్తిప్రబోధినిని తప్పక చదివి తీరవలెను. అది తమ కెంతయో యుపకారము చేయును.

దొరకుచోటు:—

శ్రీరామకృష్ణ పూజామందిరము

కొత్తపేట గుంటూరు.